# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

జులై 2025

వెల : రూ. 10.00

## సత్యం - శాంతి - దయ - ప్రేమ

ఓం శ్రీ గురుభ్యో నమః



శ్రీ బాబూజీ



శ్రీ మాతాజీ



## శ్రీ కాళీవనాశ్రమము

## శ్రీశ్రీశ్రీ హనుమత్ కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారు

మే 2 నుండి 4 వరకు ఇనమడుగు శ్రీ సత్యానంద ఆశ్రమమునందు,
శ్రీ సత్యానంద మహర్షులవారి అధిష్ఠాన మందిర ప్రారంభోత్సవంలో శ్రీ మాతాజీ










మే 8 న కామేపల్లి
గ్రామమునందు
శ్రీ బాలా త్రిపుర సుందరి
సమేత ఇష్టకామేశ్వరి
దేవాలయ
శంకుస్థాపనయందు
శ్రీ మాతాజీ

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

డా॥ యమ్. స్వర్ణముఖి
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ
సన్నిధానం కాళీమాత

సంపుటి 44 సంచిక 11
పేజీలు 44
జులై 2025

5సం॥ల చందా రూ. 500
2సం॥ల చందా రూ. 240
సంవత్సర చందా రూ. 120
విడిప్రతి వెల...... రూ. 10

బ్యాంక్ డ్రాఫ్ట్ Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ – 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by
Paluri Siva Rama Kali Prasad
on behalf of
YOGINI SRI CHANDRA
KALI PRASADA MATHAJI
CHARITABLE TRUST
and Printed at
Samardha Sadguru Publications,
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh and
Published at
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh, Editor
PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో** ............................... ....... **పేజీ**

శ్రీ కాళీ ప్రసాద శతకము .................... ..........4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 5
అమ్మమాట.................................... ............ 7
వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థాః ............9
బాలకృష్ణుడు - బాబు.................... ..............11
వృత్తి -ప్రవృత్తి ..........................................13
దత్తాత్రేయుడు.......... ................. ........................16
భగవద్గీత సాధన దీపిక ..............................18
అద్దె కొంప ........................................................20
శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద్ బాబూజీ మహరాజ్‌వారి సహస్ర నామావళిః ....... 21
శ్యామ సుందరా! ఒక్కసారి, ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ! 23
నారద భక్తి సూత్రములు ............... ..............25
శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు....28
కవరేజ్ ఏరియా .....................................29
నిరీక్షణ ..................................................................32
శ్రీ గురుగీత ......................................... ........35
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....38
విష్ణు కథలు ...... ............................ ...................40



2. *నెత్తిన జుట్టు గొరుగంగనేటికి*
*ముక్కుచెవులు గొరుగగలవె*
*గొరుగదగినవి గుణములు గదా*
*కాళీ ప్రసాదు మాట కాంతిబాట ॥*

తా: చాలామంది భక్తులు పుణ్యక్షేత్రాలకు వెళ్ళినప్పుడు తలనీలాలు సమర్పించుకుంటామని శ్రీగురుదేవుల అనుమతి కోరేవారు. అప్పుడు శ్రీవారు వారిని ఇలా ప్రశ్నించేవారు. జుట్టు గొరిగించుకుంటే మళ్ళీ నాలుగు రోజులలో వచ్చేస్తుంది కదా అని సిద్ధం అవుతారు. అదే మళ్ళీ తిరిగి మొలవని ముక్కు చెవులని కోసి ఇమ్మంటే ఇస్తారా? భగవంతునికి మీ జుట్టుతో ఏమి పని? ఆయనకు సమర్పించవలసింది మీలోని దుర్గుణాలను. వాటిని సమర్పిస్తే అప్పుడు మీరు సుగుణసంపన్నులయి ఆయన కృపకు పాత్రులవుతారు.

1. మనం చేసే పని సేవగా, కైంకర్యంగా ఎప్పుడు మారుతుంది?
2. సురేష్ గుడిలోకి అరటిగెల పంపితే దేవుడికి ఒక పండు మాత్రమే ఎందుకు అందింది?
3. మహాత్ములు దేనికోసం కర్మలు ఆచరిస్తారు?
4. నిజమైన అభిషేకం అంటే ఏమిటి?
5. భగవంతుడు మనకిచ్చే మూడు నోటీసులు ఏవి?
6. మానవుని బుర్రకీ ముంజకాయకీ ఉన్న సంబంధమేమిటి?
7. యశోదమ్మ పొందిన అదృష్టాన్ని ఈ రోజులలో పొందినదెవరు?
8. ఒకే గురువును ఆశ్రయించిన ముగ్గురు శిష్యులు మూడు విధములైన ఫలితాలను ఎందుకు పొందారు?
9. వాచా వేదాంతానికి అనుభవానికి గల తేడా ఏమిటి?

***సమాధానాలు లోపలి పేజీలలో ............................***

# శ్రీ బాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

22-6-1981

ఈ రోజు ఉదయం ఆశ్రమ గురుకులం వార్షికోత్సవం జరిగింది. శ్రీ బాబూజీ మాట్లాడుతూ 'పిల్లల్ని శ్రద్ధగా చూడాలి. పిల్లల్ని శ్రద్ధగా చూడకపోతే వారు తల్లితండ్రులకి సమస్య అవుతారు. వారికి వేళకి భోజనం, శుభ్రంగా స్నానం చేయించటం, శుభ్రమైన దుస్తులు వేయటం చేయాలి. అలా చేయకపోతే ఇంటర్‌కి వచ్చేసరికి ఆ పిల్లవాడి ఆరోగ్యం దెబ్బతింటుంది. అప్పుడు అంటారు మా పిల్లవాడు 1వ రాంకులో వస్తున్నాడు.



ఇప్పుడు ఏమైంది? అని, డాక్టర్ల చుట్టూ తిరిగి ధనాన్ని వెచ్చిస్తారు. కాని ప్రయోజనం శూన్యం. పిల్లల్ని ప్రేమించాలి. ప్రేమతో చూడాలి. చిన్నప్పుడే వారిని సరియైన మార్గంలో పెట్టాలి. వెదురు లేతగా ఉన్నప్పుడే వంగుతుంది. అది దేనికైనా పనికివస్తుంది. ముదిరిన తర్వాత అయితే విరిగిపోతుంది. అలాగే పిల్లల్ని సరియైన మార్గంలో పెట్టకపోతే వారు పెరిగిన తర్వాత తల్లిదండ్రులకి దుఃఖమే కదా!

ఇనుపపెట్టె తాళంచెవులు ఇమ్మంటాడు. ఎంతో శ్రమించి ఖర్చు చేయకుండా ఆర్జించిన సొమ్ము ఖర్చు అయిపోతుంది. ఇటు ధనము అటు కీర్తి అన్నీ నాశనము అవుతాయి. ఇటువంటివి మీకందరికీ అనుభవమే కదా! కాని క్రమశిక్షణతో పెరిగినవాడు మంచి విజ్ఞానాన్ని సంపాదించి దానిద్వారా మేధస్సు యశస్సు సంపాదించి వంశానికి తల్లిదండ్రులకి మంచి పేరు ప్రఖ్యాతులు తెస్తాడు. వాడే దేశానికి మంచి కీర్తిని తెస్తాడు. మంచి విజ్ఞానవంతుడౌతాడు. జ్ఞానాన్ని కూడా సంపాదించగల్గుతాడు. విజ్ఞానము అపహరింపబడేది కాదు. తరిగేది కాదు. ఆవ్యక్తి పోతేనే అది అంతమవుతుంది. కాని ధనము అలాకాదు. అది కొంతకాలమే ఉంటుంది. అశాశ్వతమైనది' అన్నారు.

శ్రీ బాబూజీ ఇంకా మాట్లాడుతూ, 'జ్ఞాని తాను ఎంతో శ్రమించి అనుభవపూర్వకంగా తెలుసుకున్న సత్యాన్ని పదిమందికి అందజేయ గలుగుతాడు. జ్ఞానిని ఆశ్రయించినవారు ఆ సత్యాన్ని తెలుసుకో గలుగుతారు. కాని తాము ఎంతో విజ్ఞానవంతులమని అన్నీ తమకే తెలుసునని భావించే కపట జ్ఞానులు ఉంటారు. వారు అన్నీ తెలిసినట్లుగా ఉపన్యాసాలిస్తారు. వారిని ఆశ్రయించినవారు అన్నీ ఊహించుకో వలసినదే కాని ఫలితం శూన్యం. మీకు ఒక ఉపమానం చెప్తాను.

కొంతమంది ఇంటికి వెళ్ళినపుడు కాఫీ కావాలా? టీ కావాలా? స్వీటు కావాలా? అన్న ప్రశ్నలవర్షం కురిపిస్తారు గాని చివరికి ఏదీ రాదు. వారు శబ్దం ద్వారా మర్యాద చేస్తారు. క్రియ శూన్యము. ఇంటికి వచ్చిన అతిథి అన్నీ ఊహించుకొంటూ ఉంటాడు. పదార్థము మాత్రం అందదు. పదార్థాన్ని జిహ్వాకి అందిస్తే కదా ఆనందాన్ని పొందేది. కాని మరికొంతమంది ఉంటారు. వారి ఇంటికివెళ్తే పదార్థాన్ని అందిస్తారు కాని శబ్దము ఉండదు. చూశారా ఈ ఇద్దరికి డిఫరెన్స్? అదే వాచా వేదాంతానికి అనుభవానికి గల తేడా" అన్నారు.

"మీరంతా ఒకరినొకరు ప్రేమించుకోవాలి, ద్వేషించుకోకూడదు. ఆ ప్రేమే నేనంటున్నాడు భగవానుడు. మీ మనస్సుని భగవానునిపై వుంచి సర్వే సర్వత్రా ఆయననే దర్శించాలి. అప్పుడు ద్వేషించే వస్తువు ఉండదు. సర్వత్రా ఆత్మవస్తువే గోచరించినపుడు ఇక ద్వేషించేది గాని, ద్వేషింపబడేది గాని ఏది ఉంటుంది?' అని ప్రశ్నించారు శ్రీ బాబు.

**పూజ్యశ్రీ మాతాజీ వారి సత్సంగ సమావేశములు**

**1). 29-8-25 నుండి 31-8-25 వరకు కట్టమూరు గ్రామంలో మహంకాళమ్మ గుడి వద్ద సత్సంగ సమావేశములు.**
**వివరములకు: వెంకటరావు - 99597 60387.**

**2) 3-9-25 నుండి 7-9-25 వరకు హైదరాబాద్ శాఖలో సత్సంగ సమావేశములు**
**వివరములకు: మనోహర్ - 99483 97063.**

# అమ్మ మాట
- జపమాలా ప్రసాద

## నిజమైన శివరాత్రి

"శివుడంటే ఎక్కడో మనకి కనిపించని కైలాసంలో ఉన్నాడని అనుకోకండి. 'శివ' అంటే మంగళ స్వరూపమని అర్థం. మంగళ స్వరూపుడైన ఆ శివుడు మన హృదయ మందిరములోనే వున్నాడు. సకల చరాచర విశ్వమంతా ఈశ్వరమయమే. కానీ, అహంకార మమకారములనే రెండు గట్టి తలుపులు, మన హృదయ మందిరాన్ని మూసి వుంచడం వలన, మనలోనే వున్న ఆ శివుని దర్శించలేకపోతున్నాము.



అప్రత్యక్షంగా వున్న ఆ శివుడే, గురురూపము దాల్చి వచ్చి, మన భక్తిని సిద్ధింప చేస్తారని శాస్త్రవాక్యం. గురుదేవుడు తన అపార కరుణాకటాక్ష వీక్షణములతో మన హృదయ మందిరాన్ని మూసి వుంచిన ఆ కవాటములను తెరచి, మనలోనే వున్న శివుడిని మనకు దర్శింప చేస్తారు. ఇదే నిజమైన 'శివరాత్రి'.

'శివః' అంటే మంగళమని అర్థం చెప్పకున్నాం. 'రాత్రి' అజ్ఞానానికి ప్రతీక. మనలోని అజ్ఞానం హరించి, మనం మంగళ స్వరూపులుగా మారడమే అసలైన 'శివరాత్రి'.

శివరాత్రినాడు మనం చేసేది ఉపవాసము, అభిషేకము, జాగరణ, శివపార్వతుల కల్యాణము. అయితే స్థూలంగా కాకుండా లోతుకి వెళ్ళి చూస్తే అవి ఆచరించడంలో ఎంతో అంతరార్థం యిమిడి వుంది.

'ఉప - సమీపే - వాసః' అని ఉపవాసానికి అర్థం. అంటే మన మనస్సుని ఆ శివుని దివ్య చరణారవిందముల దగ్గర (యందు) నిలపడం అని అర్థం. అంతే కాని, ఆహారం తీసుకోకుండా వుండడం మాత్రం కాదు.

అభిషేక ప్రియుడని శివుడిని అంటారు. కేవలం నమక, చమకాలతో ఆయన మీద పంచామృతాలు, నవరసాలు, గంగనీళ్ళు పోయడం మాత్రమే అభిషేకం కాదు. వాటితో పాటు మన మనస్సుని

జోడించి, తైలధారకు మల్లే శివనామస్మరణ చేస్తూ చేసే అభిషేకం, ఆ పరమేశ్వరుడికి ప్రీతిపాత్రమైనది.

'జాగరణ' అంటే కేవలం నిద్రపోకుండా వ్యర్థంగా కాలక్షేపం చేయడం కానేకాదు. విషయాదులని, విషయవాసనలని మన దరికి రానీయకుండా, అనుక్షణం భగవన్నామాన్ని స్మరణ చేసుకుంటూ, సదా సదా జాగరూకులై వుండటం నిజమైన 'జాగరణ'.

యిక చివరగా శివపార్వతుల లీలాకళ్యాణం చేస్తాం. 'లీల' అనడంలోనే వుంది 'కీలకం'. మనకి లీలా మాత్రంగా సగుణ రూపధారులై కనిపిస్తున్న ఆ పార్వతీ పరమేశ్వరులు, కేవలం ప్రకృతి - పురుషులకి, జీవేశ్వరులకి ప్రతీకలు. ఏనాడయితే మన మనస్సుని నిరంతరం శివ చరణారవిందములయందే నిలపడమనే ఉపవాసము చేసి, ఏకధారగా శివనామస్మరణ అనే అభిషేకం చేస్తూ, విషయాదులు, మాయ మనలోనికి జొరబడకుండా 'జాగరణ' చేస్తామో, అప్పుడు మనలో అజ్ఞానం నశించి జీవేశ్వరుల కళ్యాణం జరుగుతుంది. అప్పుడు, 'మేను నేను' అనుకునే 'శవత్వం' హరించి 'శివోఽహం' అంటే 'మంగళస్వరూపుడైన శివుడిని నేను' అనే 'శివత్వం' సిద్ధిస్తుంది. ఇదే, అమ్మవారి నామాలలో 'శివశక్త్యైకరూపిణ్యైనమః' అనేది తెలియజేస్తోంది. అటువంటి శివత్వాన్ని ప్రసాదించే గురుపాదుకలు అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను ప్రసాదించి సర్వులనూ కాపాడుగాక!

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***జులై 2025 :*** AS 6900, 8021,8149, 8542, PK 0099

***ఆగష్టు 2025 :*** AS 8544, 8545, 9287, PK 0101

# వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థాః

- భాగవతుల హనుమత్ జయప్రద

ఒక శిష్యుడు ఆత్మజ్ఞానం కోసం ఒక గురువు గారిని ఆశ్రయించాడు. గురువుగారు ఒక గుహలో తపస్సు చేసుకుంటున్నారు. శిష్యుడు వెళ్ళగానే, "నాయనా! అక్కడ దీపం ప్రమిద ఉంది, అందులో నూనె పోసి, వత్తి వేసి, వెలిగించు" అంటారు. శిష్యుడు ఆ వత్తిని ఎంతసేపు నూనెలో తడిపినా కూడా అది వెలగదు. అప్పుడు గురువుగారు, "నువ్వు ఇంతసేపు వత్తిని నూనె అనుకుని నీటిలో తడుపుతున్నావు, నూనెలో తడిపితే వెలుగుతుంది" అని అంటారు. అప్పుడు శిష్యుడు తాను చేసిన తప్పుని గ్రహించుకుంటాడు. ఈ విధంగానే మనము, జీవిత సార్థక్యం కోసం చేసే కర్మాచరణ, ఎటువంటిదో తెలుసుకోకుండా చేయడం వలన, ఎటువంటి ప్రయోజనం పొందలేకపోతున్నాము. నిజానికి కొన్నిమార్లు నూనె ఏదో, నీరు ఏదో కూడా తెలియని పరిస్థితి. దీనికి ఉన్న ఒకే ఒక తరణోపాయం, ఎవరైతే జ్ఞానాన్ని పరిపూర్ణంగా తెలుసుకుని, పొందివున్నారో వారిని ఆశ్రయించడమే.

ఒకడు ఉప్పు గురించి వంద పుస్తకాలు చదివాడు. మరొకడు ఉప్పు రుచి చూశాడు. ఇప్పుడు ఎవరైనా ఉప్పు గురించి నిజంగా తెలిసినవాడు ఉన్నాడు అంటే అది, "తిని తెలుసుకున్నవాడే" (**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినః తత్త్వదర్శినః** (గీతా 4.34)

శ్రీ దత్తాత్రేయస్వామిని, కార్తవీర్యార్జునుడు, సంవర్తుడు, పరశు రాముడు ముగ్గురూ ఆరాధించారు. కార్తవీర్యార్జునుడు అణిమాది అష్టసిద్ధులని పొందాడు. సంవర్తుడు అవధూత అయినాడు. పరశు రాముడు జీవన్ముక్తుడు అయినాడు. దత్తాత్రేయుని గురువుగా భావించి సేవించిన కార్తవీర్యుడు, అసూయాపరుడై బ్రాహ్మణుని ధేనువుని అపహరించాడు. అంతటి గొప్ప గురువునకు శిష్యుడు అయి ఉండి, ఎందుకు ధేనువుని అపహరించాడు? ముగ్గురికీ గురువు ఒక్కరే అయినా, శిష్యుల అధికారములలో భేదము ఏర్పడుతున్నది. కార్తవీర్యుడు విరక్తుడు కాదు, జిజ్ఞాసువు కూడా కాదు. తనయొక్క శక్తి సంపదను పెంపొందించుకోడానికి, గురువు దగ్గరకు చేరాడు. తత్త్వం అడుగలేదు,

అందుకని గురువు బోధించలేదు. అతడు ఐహిక సుఖాలే కావాలను కున్నాడు. అణిమాది సిద్ధులని పొందాడు. సంవర్తుడు పరశురాముడి మార్గ మధ్యంలో అవధూతగా తారసపడి, పరశురాముడిని దత్తాత్రేయుని దగ్గరకు పంపాడు. పరశురాముని లోపల ఉన్న అభిమానము, క్రోధము తగ్గడానికి గల సందర్భాన్ని దత్తాత్రేయుడు కలుగజేశాడు.

పరశురాముడు దత్తాత్రేయుని కలుసుకునేందుకు వెళ్ళే మార్గ మధ్యంలో లోకం గురించి విమర్శిస్తూ "జిహ్వాచాపల్యం, స్త్రీ సుఖం అనేవే పతన కారణములు" అని విచారణ చేశాడు. తీరా దత్తాత్రేయుని దగ్గరకి వచ్చేసరికి, ఆయన ఒడిలో లక్ష్మీ సమానురాలు ఐన ఒక స్త్రీ కౌగలించుకుని ఉన్నది. వారి ముందు ఒక పెద్ద పాత్రలో మద్యం పెట్టబడి ఉన్నది. ఇవి చూసిన పరశురామునికి దత్తాత్రేయుడు తనని పరీక్షకి గురిచేస్తున్నాడు అని, జ్ఞానులు ఇంద్రియ నిగ్రహం కలిగి ఉంటారు అని, వేదాంత విజ్ఞానాన్ని సుదృఢంగా నిశ్చయించుకుని (**వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థాః**), ఎప్పుడూ సత్యాన్ని అనుభవిస్తూ ఉంటారు అని గ్రహించి, ఏది ఏమైనా సరే ఈయనే నా గురువు అని నిశ్చయించుకున్నాడు. ఆ తర్వాత మాత్రమే శ్రీ దత్తాత్రేయ స్వామి, పరశురాముడిని ఆదరించి మహిమాన్వితమైన త్రిపురా రహస్యాన్ని ఉపదేశిస్తారు.

**వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థాః** అనే భావన అనుభవానికి సంబంధించినది. గ్రంథాలు చదివినంత మాత్రాన పూర్తి జ్ఞానం రాదు. అనుభవం కలిగిన గురువుని ఆశ్రయించి, ఆత్మసాధన చేస్తేనే, వేదాంతం జీవనంగా మారుతుంది **బోధనగా కాదు, బోధిగా.** అదే స్వరూపాన్ని పరశు రాముడు గ్రహించిన విధానం మనందరికీ మార్గదర్శిగా నిలుస్తుంది. ఈ అనుభవజ్ఞానమే మన జీవితాన్ని వెలిగించే నిజమైన నూనె.

**భీమవరం శాఖలో కార్యక్రమాలు**

1. ది.17.07.2025 గురువారం నుండి 14.08.2025 గురువారం వరకు శ్రీ శ్రీనివాస రామానుజదాసు గారిచే శ్రీమద్భాగవత ప్రవచనం - కృష్ణ తత్త్వం. ప్రతిరోజు సాయంత్రం 6.00 గం.ల నుండి 8.00 గం.ల వరకు
2. ది.25.07.2025 శుక్రవారం నుండి 23.08.2025 శనివారం వరకు శ్రావణ మాసం సందర్భముగా ప్రతిరోజు శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, ప్రతి శుక్రవారం కుంకుమ పూజలు. ఆసక్తి కల భక్తులందరూ పాల్గొన వచ్చును.

## **బాల కృష్ణుడు – బాబు** - పాలూరి కాళీప్రసాద్

సమర్థ సద్గురుదేవులు శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారు కొన్ని దశాబ్దాల పాటు సంచరించి, ఎందరో భక్తులను ఉద్ధరించి, తమ చరణధూళితో పవిత్ర క్షేత్రంగా మలచిన భీమవరంలో శ్రీ కాళీవనాశ్రమ శాఖను ఏర్పరచుకొని బృందావనం, ఇతర ఉపాలయాలు, అన్నదాన, వసతి భవనాలను నిర్మించుకొని ప్రారంభించుకొంటున్న సందర్భంగా శ్రీబాబు దివ్య లీలలను కొన్నింటిని గుర్తు చేసుకొందాం. శ్రీబాబుతో భీమవరంలో సన్నిహితంగా గడిపిన వారందరూ అనే మాట అప్పటి రోజులు శ్రీకృష్ణుడు బృందావనంలో గడిపిన రోజులలాంటివని. అందుకే శ్రీబాబును బాలకృష్ణుడితో పోల్చి ఆ ఆనందాన్ని అందుకోవాలనే ఈ చిన్ని ప్రయత్నం.

కంసుని బాధల నుండి విముక్తి కొరకు భూదేవి, ఇతర దేవతలు ప్రార్థించగా నారాయణమూర్తి శ్రీకృష్ణావతారం ధరించాడు కదా! కంసుడు అంటే ఆత్మ సుఖానికి అడ్డుపడే పూర్వ వాసన అని అర్థం చెబుతారు. గొప్ప ఆధ్యాత్మిక సాధకులై భక్తి, జ్ఞాన, వైరాగ్యములు కలిగిన వారు, లేదా అటువంటి వారి కుటుంబంలోని వారు కూడా మోక్షఫలాన్ని అందుకోలేకుండా అడ్డుపడుతున్న కులమతాల అంతరాలు, అంటరానితనం, మూఢాచారాలు మొదలైన వాసనలను తొలగించి మోక్షమార్గాన్ని నిష్కంటకం చేయడానికి అవతరించారు శ్రీబాబు. శ్రీకృష్ణుడు దేవకీదేవి గర్భాన పుట్టాడని చెప్పుకుంటాం కానీ ఆయన నిజంగా పుట్టాడా? అంటే లేదనే సమాధానం. చతుర్భుజాలతో, శంఖచక్రాది ఆయుధాలతో ఆయన కనిపించాడు. అంతేకానీ దేవకి ప్రసవ వేదన పడలేదు. అందుకే అన్నమయ్య **'నవ్వుచు దేవకి నందను కనియె'** అంటాడు. ఎప్పుడెప్పుడు ధర్మరక్షణకు అవసరమైతే అప్పుడప్పుడు నా మాయను తోడు చేసుకొని నేను అవతరిస్తూ ఉంటానని స్వామి చెప్పారు కదా! అలాగే శ్రీబాబు కూడా ఏ తల్లిదండ్రులను నిమిత్తమాత్రంగా చేసుకొని ఈ పుణ్యభూమిలో అవతరించారో ఎవరికీ తెలియదు.

శ్రీకృష్ణుడు అవతరించడానికి ఎంతో ముందుగానే ఆకాశవాణి ఆ వార్తను కంసునికి సూచించినట్లుగానే శ్రీబాబు వారికి దర్శనం ఇవ్వడానికి చాలా సంవత్సరాల ముందుగానే శ్రీ కందర్ప పరశు

రామయ్యగారికి, శ్రీ కలిదిండి నరసింహరాజుగారికి, శ్రీ చల్లా కృష్ణమూర్తిగారికి, కోటిపల్లి మామ్మగారని పిలువబడే శ్రీమతి శేషమాంబగారికి వారివారి ఆరాధ్య దైవాల రూపంలో స్వప్నదర్శనం ఇచ్చి తాము వారి మధ్యకు రాబోతున్నామని తెలియజేశారు.

దేవకీ వసుదేవులకు అవతరించిన శ్రీకృష్ణుడు తనను పెంచి పెద్దచేసే మహద్భాగ్యం మాత్రం యశోదమ్మకు అనుగ్రహించాడు. అలాగే శ్రీబాబు ముందు కొంతకాలం ఒక కోయ దంపతుల వద్ద పెరిగి, ఆ తరువాత ఉప్పాడలోని సత్యవతమ్మగారికి యశోదమ్మకు అనుగ్రహించిన మహద్భాగ్యాన్నే అనుగ్రహించారు. శ్రీకృష్ణుడు ఒక్కసారి బృందావనాన్ని విడిచి మధురకు వెళ్ళిన తరువాత మళ్ళీ యశోదమ్మ దగ్గరకు తిరిగి రాలేదు. అలాగే ఒక్కసారి ముంజవరపుకొట్టు వెళ్ళిన శ్రీబాబు మళ్ళీ ఉప్పాడకు తిరిగి రాలేదు.

ఒకనాడు తనకోసం తృణావర్తుడు వస్తున్నాడని తెలిసి యశోదమ్మ ఒడిలో పడుకుని ఉన్న కృష్ణయ్య ఒక్కసారిగా ఆవిడ మోయలేనంత బరువెక్కిపోయాడు. ఇదే లీల శ్రీబాబు శ్రీ చల్లా కృష్ణమూర్తిగారికి చూపించారు. శ్రీబాబు నవయవ్వనంలో చాలా సన్నగా వుండేవారు. కృష్ణమూర్తిగారు నడివయసులో భారీ కాయంతో వుండేవారు. అయితే వారు శ్రీబాబుచే నాన్నగారని పిలిపించుకొన్న శ్రీ కందర్ప పరశురామయ్యగారి అల్లుడు కావడంతో శ్రీబాబుతో బావ బావమరదుల వంటి సాన్నిహిత్యం, చనువు ఉండేది. ఆ చనువుతో ఒకసారి భీమవరంలో ఆయన శ్రీబాబు కుర్చీలో కూర్చొని ఉండగా వచ్చి వారి ఒడిలో కూర్చొని తన బరువునంతా శ్రీబాబుపై వేసి ఉడికించాలని చూశారు. అయితే ఆయన ఎంత ప్రయత్నించినా శ్రీబాబు ముఖంలో చిరునవ్వే కానీ బరువు మోస్తున్న శ్రమ ఏమాత్రం కనపడలేదు. ఇక లాభంలేదని ఆయన లేచి వేరొక కుర్చీలో కూర్చోగానే శ్రీబాబు వెళ్ళి ఆయన ఒడిలో కూర్చున్నారు. 'ఆ! ఈ బక్కపలచని ఆయన ఏం బరువుంటారు లే!' అని భావించిన ఆయనకు పదునాలుగు భువనాలు ఒక్కసారి వచ్చి తన ఒడిలో కూర్చున్నంత తీవ్రమైన బాధ కలిగింది. ఆ బరువు మోయలేక విలవిలలాడారు.

- సశేషం

# వృత్తి - ప్రవృత్తి

సేకరణ - కీ.శే. జానకిరామ శాస్త్రి

వృత్తి, ప్రవృత్తి పరమాత్మ పరమైతే, పనులన్నీ పరమాత్మ సేవలే అవుతాయి.

**"మత్కర్మకృ న్మత్పరమో మద్భక్త స్సంగవర్జితః।**

**నిర్వైర స్సర్వభూతేషు య స్స మామేతి పాండవ! ॥".**

అర్జునా! తన ధర్మములను నా ఆరాధన బుద్ధితో చేయువాడును, నేనే ప్రధానోద్దేశముగా గలవాడును, పరమ ప్రీతితో నన్నే ధ్యానించు వాడును, నాకంటే వేరైన వస్తువులతో తనకు సంబంధము లేని వాడును, సకల ప్రాణుల యందును విరోధములేని వాడును ఎవడో వాడు, నన్ను పొందుచున్నాడు.

మానవ జీవితం పనిచేటడం కోసం ఏర్పడినది. ఒక వ్యక్తికి ఒక ఊళ్ళో వుద్యోగం ఇస్తే, ఆ ఉద్యోగం కోసం ఆ ఊరు వెళ్ళినవాడు ఆ ఉద్యోగం ఉన్నంత వరకూ, ఆ ఊరిలో ఆ ఉద్యోగకృత్యమేదో దానిని నెరవేరుస్తూనే ఉండాలి. అలానే మానవ శరీరంలోకి రావడానికి లక్ష్యం ఈ శరీరాన్ని వినియోగిస్తూ, ఇచ్చిన వాడివైపు ప్రయాణం కొనసాగించడం, దీనిని ఇచ్చినవాడు ఎవడో భగవద్గీత చెపుతుంది. ఎన్నో రకాల దర్శనాలున్నాయి. ఎందరో మత ప్రవక్తలున్నారు. ఎన్నెన్నో రకరకాలుగా వారు చెప్పారు. కానీ భగవద్గీతలో శ్రీకృష్ణుడు "ఈ శరీరంలో జీవుని కూర్చిన వానిని నేను" అని చెప్పాడు. "**అహం బీజప్రదః పితా**" ఈ ప్రకృతిని ఒక శరీరంగా మారేలా చేసి, అది మానవాకృతికి వచ్చేటట్లు చేసి, అందులో ఈ జీవిని నిలిపిన వాడిని నేనే అన్నాడు.

అనేక జన్మలనుండి తెచ్చి పెట్టుకున్న కర్మల భారాన్ని తగ్గించుకోవడానికి మానవదేహం అన్నిటికంటే ఉత్తమమైన సాధనమని భగవంతుడు జీవుడికి ఈ శరీరాన్ని లభించేలా చేశాడు. అయితే ఈ జీవుడు తన ప్రవృత్తి వల్ల, కర్మలను తొలగించుకోవచ్చు, కర్మలను పెంచుకోవచ్చు కూడా. మానవ శరీరం అంత గొప్పది. ఎలా చేస్తున్నావో, ఎందుకు చేస్తున్నావో, తెలిసి ఆచరిస్తే ఆ తెలివి ఆ చేసే పనిని అంటనివ్వదు సరికదా, గతంలో ఉన్న ప్రాచీనమైన కర్మ నంతటినీ భస్మంచేసి పారేస్తుంది. దూది బోలెడంత వున్నా ఓ చిన్న నిప్పుకణం దానిలో వేస్తే అంత దూదిని అదెలా భస్మం చేయగలదో అలానే చేయవలసిన కర్మలను మనం సరిగా చేస్తే అది ఎన్నెన్నో జన్మలనుంచి పేరుకు పోయి ఉన్న ప్రాచీన పాపరాశినంతటినీ భస్మం చేసి పారవేయగలదు. చేయవలసినదల్లా భగవన్నామాన్ని మనోమందిరంలో నింపుకోవడమే అని మనకు భగవంతుడు 11వ అధ్యాయపు 55వ శ్లోకంలో చెప్పాడు.

మొదటి శ్వాసనుంచి తుదిశ్వాస దాకా పనిచేస్తుండటమే మానవుని కర్తవ్యం. తెలియక కొందరు మేము జ్ఞానులమైపోయాం, మేము రాజయోగులమైపోయాం, కనుక

మాకు ఈ పనులన్నీ అవసరం లేదు అని పుట్టుకతో ఏర్పడ్డ బాధ్యతలను, కర్తవ్యాలను వదలుకొని తమ ప్రకృతి బంధాలన్నీ విడిపోయాయని భ్రమిస్తారు. భగవద్గీతలో స్వామి ఇది తగదని అనేక సందర్భాలలో స్పష్టం చేశారు. నీవు ఇక్కడకు వచ్చినది కేవలం కర్మాచరణ కోసమే. మానవ శరీరమే జీవుడికి ఒక ఉద్యోగం. ఇందులో మొదటి శ్వాస నుంచి తుదిశ్వాస దాక ఉద్యోగపు సమయం. కనుక ఉద్యోగ సమయంలో ఇతర ప్రవృత్తులు పనికిరావు. ఫలాశ తగదు. పని చేయక తప్పదు. పని మానడం తగదు. దానిని కర్మ అంటాడు. కర్మ ఎప్పుడూ మానవద్దు. కర్మయందు ఉండే భావనను మార్చు. ఇదివరకు ఇది నా పని. నావిధి, నేను చేసుకుంటున్నా, నా ఫలితం కోసం అనే భావనను మార్చి ఇది భగవంతుడి పని, అతని ప్రయోజనంగా చేసేది, ఫలము అతనికే చెందినది. అనుభవించే నాకు అతనితో ఉండే సంబంధం వలన ఈ పని నేను చేయతగును అని నన్ను ఇక్కడికి పంపాడు అనుకొంటూ చేయాలి.

ప్రతిపనీ చేయకుండా ఉండలేక ప్రీతితో చేస్తారు. ఇప్పుడు దీనినే "సేవ" అంటారు లోకుల విషయంలోనైతే, అదే భగవంతుడి విషయంలో అయితే "కైంకర్యము" అని అంటారు. కింకర అని పనిచేసేవాడికి పేరు. ఆ పేరు ఎందుకు వచ్చిందంటే కిం కరవాణి, కిం కార్యం అని అడిగి, చెప్పినవన్నీ చేసేవాడు కింకరుడు. ఈ కింకరుడు చేసే పనే కైంకర్యం. నిజానికి నేడు లోకంలో ఈ పదాన్ని పాడుచేశారు. ఎవరైనా తనది కాని వస్తువును స్వంతం చేసుకునే ప్రయత్నంలో ఉంటే కైంకర్యం చేశాడని అంటున్నారు. కానీ ఆ పదానికి అసలు అర్థం అది కాదు. ఆ పదం చాలా గొప్పది.

ఈ పని, ఆపని లేదు, ఏపని చేసేవాడైనా తను చేసే పని భగవత్ సేవగా అనుకుని చేస్తే దానినే కైంకర్యం అని అంటారు. "**మత్కర్మ కృత్**" "నీవు ఏపనైనా నా పనిగా చేయవయ్యా! నీవు దానములు చేయి, ధర్మములు చేయి, యోగములు చేయి, యాగములు చేయి, నాసేవ అనుకుంటూ చేయి. నీవు చేసే ఏపనైనా కైంకర్యం అనుకుంటూ చేయి. అది నీకు బంధకం కాకుండా నేను చూస్తా! నేను అట్లానే పనిచేస్తా! కనుక నాకు ఏదీ బంధకం కాదు. నీవు అలా పనిచేయడం ప్రారంభం చేయి. నీకూ అవి బంధకం కాకుండా చూసేవాడిని నేను. ఏపని అయినా ఫలితం లభించేటట్లు నేను చేయాలి. కనుక అవి నీకు ఉత్తమ ఫలితమిచ్చేలా చేస్తా, బంధకం కాకుండా నేను తీర్చిదిద్దుతాను" అని మొదట చెప్పాడు.

రెండవది "**మత్పరమః**" నీవు ఏది చేసినా అది చెందేది నాకు అని గుర్తించు. నాకంటే మించి మరొకరు ఎవరూ ఫలితాన్నివ్వగలిగినవాడు లేడు. కనుక ఏది నువ్వు చేసినా, ఇది శ్రీకృష్ణుడిదాకా చెందుతోంది అని అనుకుంటూ చేయి. "**మత్పరమః**" నేనే ప్రయోజనంగా కల్గి వుండాలి. లోకంలో పొలం దున్ని పండించేది కూలీలు. ఫలితం

పొందేది ఆ పొలం కలిగిన రైతు. కూలీ "మా యజమాని కోసం చేస్తున్నాను" అంటాడు. యజమానిని దేవుడు అంటాడు. వానికి ఎంతో చాకిరీ చేస్తాడు. ప్రతిగా ఎంతో కొంత జీతం అందుకుంటాడు. కానీ ఆవ్యక్తి ఆ కూలీవానికి ఆ ఉద్యోగమివడానికి కారణం ఆ వెనుక ఉండే భగవంతుడేనని గుర్తు పెట్టుకుంటూ చేయగల్గితే అదీ భగవంతుడి సేవే. "అర్జునా! ప్రీతి నీకు ఏర్పడవలసినది నా విషయంలో, అప్పుడు నీవు నా భక్తుడవు కాగల్గుతావు. "**సంగవర్జితః మద్భక్తః**" నా యందు భక్తితో నీకు ఇతరమైనవాటి యందు ఆసక్తి ఉండదు" అంటాడు స్వామి.

"**పరమాత్మని యో రక్తః, విరక్తః అపరమాత్మని**" అంటుంది శాస్త్రం. భగవంతుడి మీద ఏర్పడ్డ రక్తి భగవదితరమైన వాటియందు ఉండే రుచిని తగ్గిస్తుంది. శ్రీ యామునాచార్య స్వామివారు అంటారు. "**స్థితే అరవిందే మకరంద నిర్భర మధువ్రతః నేక్షు రసం హి వీక్షతే**". అద్భుతమైన తేనెలూరే ఒక పద్మంలో ఒక మధుపం చేరి అందులో ఉండే తేనెను ఆస్వాదించ నేర్చిన తరువాత ఆ ప్రక్కన ఎక్కడో ఉంటే ఒక క్షుద్రమైన గడ్డిపువ్వులో ఉండే తేనె కోసం ఆది ఏవిధంగా ఆశించదో, అదే విధంగా నాయందు శ్రద్ధగల్గి సంగం ఏర్పడ్డ వ్యక్తులకు అల్పమైన ఇతర లౌకిక వస్తువుల యందు సంగము ఉండనే ఉండదు. ఇది అయిన తరువాత "**నిర్వైర స్సర్వ భూతేషు**" లోకంలో దేనియందూ వీడికి వైరం ఉండదు. వీడియందు ఎవరికీ వైరం ఉండదు కూడా. లోకంలో అన్నిటి వెనుక ఉండి నడిపించే తత్వం ఒకరే పరమాత్మ అయినపుడు, ఒకడు మిత్రుడు, ఒకడు శత్రువు అనే ప్రశ్న ఎక్కడ ఉంటుంది? నిజమైన జ్ఞానం కల వ్యక్తికి ఈ దృష్టి ఏర్పడుతుంది కనుక అన్నిటా భగవంతుణ్ణి చూస్తాడు . అలాంటి వాడు నా దివ్యమైన సాయుజ్యాన్ని పొందగలుగుతాడు.

మనం మన పనులు భగవత్ పరం చేద్దాం, సంగం భగవంతుని యందు వుంచుకుందాం, ఆ భగవదనుగ్రహాన్ని మనం మన వారందరికీ పంచుదాం! మాధవ సేవగా సర్వప్రాణి సేవ చేయగలిగే యోగ్యత మనకి మరింతగా ప్రసాదించమని కోరుదాం! కేవలం మానవులకి మాత్రమే చేసే సేవ మాధవ సేవ అని దాన్ని అక్కడికి పరిమితం చేయవద్దు. మాధవ సేవగా సర్వప్రాణి సేవ చేద్దాం! గీతాజ్యోతి మనకందించే సందేశాన్ని మనం ఆచరిస్తూ ముందుకు అడుగువేద్దాం. మాధవ అనుగ్రహాన్ని పొందే ప్రయత్నం చేద్దాం!!

## దత్తాత్రేయుడు

- సన్నిధానం కాళీమాత

**గురు బ్రహ్మ గురు ర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః।** - ఈ శ్లోకం దత్తాత్రేయునికి ధ్యానశ్లోకం, స్తోత్రం కాదు. మంత్ర శాస్త్రంలో దత్తాత్రేయునికి ధ్యానశ్లోకం. అనసూయ, అత్రి మహర్షులకు త్రిమూర్తుల వర ప్రభావం వలన, అత్రి మహర్షి యొక్క తపోబల సంపన్నమైన పరమ ధార్మికమైన తేజస్సు, అనసూయ ఉత్తమ గర్భం ఈ మూడు అంశముల మేలు కలయికగా దత్తాత్రేయ మహర్షి యొక్క జన్మము సంభవించినది. మహాపతివ్రత, తపస్సంపన్నురాలైన అనసూయామాత చేసిన లోకోపకారానికి, త్రిమూర్తులు ఇచ్చిన వరము దత్తాత్రేయ మహర్షి.

పూర్వం కౌశికుడనే బ్రాహ్మణుడు దుష్టుడు, వేశ్యాలోలుడుగా వుండగా, మహాపతివ్రత అయిన ఆయన సతీమణి సుమతి కుష్టు రోగంతో వున్న తన భర్తని, తన సేవలతో మెప్పించి, ఒప్పించి ఒక వేశ్యా సమాగమం కోసం తీసుకువెళ్తూ వుండగా ఒక విపత్తు జరిగింది.

ఒక రాత్రి ఆ పట్టణాన్ని పాలించే రాజు ఇంట్లో దొంగలుపడి, రాజుగారి ఏకైక కుమారుణ్ణి నిర్దాక్షిణ్యంగా చంపి, నగలు ఎత్తుకు పోయారు. ఆ ఊరి బయట మహాతపస్వి అయిన మాండవ్య మహాముని తపోనిష్ఠలో వుండగా, రాజభటులచే తరమబడుచున్న దొంగలు, భయంతో ఆ నగల మూటను ఆ మహాముని సమీపాన పడవేసి పారిపోయారు. యోగనిష్ఠలో వున్న ఆ మహర్షి శరీర స్పృహ లేకుండా వున్నారు.

భటులు, నగలతో వున్న ఆయనను మహర్షి అని తెలియక ఆయనయే దొంగ అని భావించి, రాజు వద్దకు తీసుకు వెళ్ళారు. దుఃఖంలో వున్న ఆ రాజు నగలతో వున్న దొంగ దొరికాడు అన్న ఆ మాట మాత్రమే విని, ఎవరో చూడకుండానే 'కొరత వేయండి' అని శిక్ష విధించాడు. భటులు ఆ మహర్షిని తీసుకువెళ్ళి, ఒక పెద్ద బల్లెం తీసుకుని నేలలో గుచ్చి, ఆ బల్లెం కొనను ఆయనకు గుచ్చారు. అప్పటి వరకూ శరీర స్పృహ లేకుండా తపోనిష్ఠలో వున్న మాండవ్య మహర్షికి ఆ బాధ వలన తెలివి వచ్చింది. పరమ శాంతుడైన ఆ ఋషి ఆ బాధను భగవద్ నిర్ణయంగా తీసుకుని అనుభవిస్తూ వుండగా, తన భర్తను బుట్టలో

పెట్టి  వేశ్య దగ్గరకు తీసుకు వెడుతున్న సుమతి ఆ మార్గం గుండా రావడం, తన భర్త కాళ్ళు ఆ మహర్షికి తగలడం వలన భరించరాని బాధతో ఆ మహర్షి, 'నా బాధను పెంచిన వాడెవడో సూర్యోదయం కాగానే తల వేయి చెక్కలై మరణిస్తాడు' అని శపించాడు. ఆ శాప వచనాలు విన్న సుమతి, తన భర్తకు మరణం రాకుండా వుండటానికి, 'అసలు సూర్యోదయమే అవకుండా వుండుగాక!' అని ప్రతి శాపం ఇచ్చింది.

మరునాడు సూర్యోదయం కాకపోవడంతో లోకమంతా చీకట్లతో అల్లాడుతుండగా, దేవతలందరూ అనసూయా దేవిని శరణు వేడారు. అప్పుడు అనసూయా దేవి సుమతి దగ్గరకు వచ్చి, 'అమ్మా! సూర్యోదయం కానివ్వు. నీ భర్తను నేను బ్రతికిస్తాను' అని అభయం ఇచ్చింది. సుమతి అంగీకరించింది. తిరిగి సూర్యోదయం అయింది, కౌశికుడు మరణించాడు. అనసూయ తన తపోబలంతో అతనిని తిరిగి బ్రతికించింది. అప్పుడు త్రిమూర్తులు ప్రత్యక్షమై అనసూయాదేవితో 'లోకోపకారం చేసిన నీకు వరం ఇవ్వదలచాము, వరం కోరుకోమనగా, తనకు వారి ముగ్గురి అంశతో కుమారుడుగా జన్మించమని కోరింది. వారు '**తథాస్తు**' అన్నారు.

లోకంలో తేళ్ళు, పాములు మొ॥ అనేక క్రూర జంతువులు వుంటాయి. అవి లేకుండా చేయమని భగవంతుడిని అడగకూడదు. మనమే జాగ్రత్తగా వుండాలి. సృష్టి లక్షణమే అది. ఇవి ఎందుకు వుండాలి అంటే, అవి లేకపోతే మనం చేసే పాపాలకు శిక్షలు ఎలా వుంటాయి? పాపం చేసే బుద్ధి మనిషికి వున్నంత వరకూ దానికి శిక్ష ఇవ్వగలిగిన శక్తిని కూడా సృష్టి లక్షణంగానే భగవంతుడు ఇస్తాడు. భూమిపై ధర్మానికి గ్లాని కలిగి, అనాచారాలు పెరిగి, మానవులు సత్కర్మలు వదలి, భ్రష్టులై, రాక్షస ప్రాబల్యం పెరిగి వారు మనుష్యులను, దేవతలను బాధించడం మొదలైంది. ధర్మము అనే కవచము రక్షణ లేకపోతే, ఆత్మ రక్షణ కష్టమే.

- సశేషం

# భగవద్గీత సాధన దీపిక

(గత సంచిక తరువాయి) - కీ.శే. శ్రీ గూడా శివ రామమూర్తి

**అర్జున ఉవాచ:**

**4. కథం భీష్మ మహం సంఖ్యే ద్రోణం చ మధుసూదన!**
**ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హావరిసూదన! ॥**

**5. గురూనహత్వా హి మహానుభావాన్**
**శ్రేయోభోక్తుం భైక్ష్యమపీహ లోకే**
**హత్వార్థ కామాంస్తు గురూనిహైవ**
**భుంజీయ భోగాన్ రుధిరప్రదిగ్ధాన్ ॥**

శ్రీకృష్ణ భగవానుడు చెప్పింది విన్న తరువాత కూడా అర్జునుడు యుద్ధం చేయటానికి సిద్ధం కాలేదు. పైగా ఇప్పుడు అతడు తనను తాను సమర్థించుకోవటం మొదలుపెట్టాడు. "ఓ మధుసూదనా! తాతాదులైన భీష్ముడు, గురుదేవుడైన ద్రోణాచార్యుడు పూజనీయులు. పూజార్హులైన వారిని బాణాలతో ఎలా హింసిచేది?" అన్నాడు. అర్జునుడు ఇంతకు ముందు వారిని స్వజనం అన్నాడు. స్వజనం అయినా సరే, నీ



స్వధర్మాన్ని నిర్వర్తించటానికి నీవు వారితో యుద్ధం చేయవలసిందే అని శ్రీకృష్ణ భగవానుడు అనగానే, ముందు స్వజనం అన్న అర్జునుడు ఇప్పుడు భీష్ముడు, ద్రోణులు పూజింపదగినవారు, వారిని బాణాలతో ఎలా బాధించటం? అని అభ్యంతరం తెలిపాడు. భీష్మ, ద్రోణులను బాణాలతో కొట్టడం పాపం అన్న ఊహ, యుద్ధభూమికి రాకపూర్వం అర్జునుడికి ఏ కోశానా లేదు. కాని శ్రీకృష్ణ భగవానుడు స్వజనం అంటే ఏమిటో తెలుపగానే, వీరు గురువులు, పూజ్యులు అయినారు. యుద్ధానికి వచ్చేముందు కాని, తనలో అజ్ఞాన జనితమైన, మమకార రూపమైన ఆసక్తి ప్రకటం కాకముందు కాని, అర్జునుడు ఈ విధంగా, అంటే గురువులతో పూజ్యులతో యుద్ధం చేయకూడదని ఎన్నడూ అనుకోలేదు. కాని అర్జునుడిలో ఆసక్తి ఎప్పుడైతే మేలుకుందో, అప్పుడే అది అతని

విలువలనన్నింటిని మార్చివేసింది. అది ఇప్పుడు అర్జునుడికి నలుపు తెలుపుగా, తెలుపు నలుపుగా కనపడేటట్లు చేస్తుంది. అర్జునుడికి విలువలన్నీ తారుమారై, భూతద్దంలో నుండి కనిపించినట్లుగా కనిపిస్తున్నాయి. అందుకే అర్జునుడు శ్రీకృష్ణ భగవానుడు చెప్పిన తరువాత కూడా తనను తాను అలా సమర్థించుకున్నాడు.

అర్జునుడు అంతటితో ఆగలేదు. ఆతడు "కృష్ణా నేను కోరేది శ్రేయస్సును. దానిని పొందటానికి పూజ్యులను, గురువులను నొప్పించటం నాకిష్టంలేదు. గురువులతో యుద్ధం చేసి, వారిని బాణాలతో నొప్పించి, హింసించటం కంటే నాకు భిక్షాటనమే మేలు. ఇహలోక సుఖాలకోసం, అర్థ కామములను పొందటం కోసం, గురువులను చంపలేను, చంపి ఆ నెత్తుటి కూడు తినలేను" అన్నాడు.

అర్జునుడు యుద్ధభూమికి రావటానికి పూర్వము తాను సన్యాసాన్ని గురించి గాని బిచ్చమెత్తుకోవటాన్ని గురించి గాని, కనీసం ఊహించి అయినా ఉండడు. అయినప్పటికీ, ఇప్పుడు ఆసక్తిమూలంగా విలువలన్నీ అస్తవ్యస్తమై, అతనికి ఈ పరధర్మమే అనుసరణీయంగా అనిపిస్తున్నది. దీనినుండి నీవు గ్రహించవలసినది ఏమిటంటే, జీవితంలో సమస్యలు ఎదురై నీలో ఆసక్తి మేలుకుంటే, నీ ప్రవర్తన కూడా అలాగే వుంటుంది అనీ, అర్జునుడిలాగే రకరకాల కారణాలతో నిన్ను నీవు నమ్మించుకొని, ఇతరుల ముందు నీ చేతలను నమర్థించుకోటానికి వెనుకాడవు అని.

**6.** **నచైత ద్విద్మః కతరన్నో గరీయో**
**యద్వా జయేమ యది వానో జయేయుః**
**యానేవ హత్వా న జిజీవి షామ**
**స్తేఽ వస్థితాః ప్రముఖే ధార్త రాష్ట్రాః ॥**

**7.** **కార్పణ్య దోషోపహతస్వభావః**
**పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢ చేతాః**
**యచ్ఛ్రేయస్స్యాన్నిశ్చితం బ్రూహితన్మే**
**శిష్యస్తే హం శాధి మాం త్వాం ప్రపన్నం ॥**

- సశేషం

# అద్దె కొంప

-ఎన్. కుట్టీ

మానవ శరీరం ఒక అద్దె కొంప. భగవంతుడు ఏం చెబుతున్నాడంటే, 'నాయనా! ఇది ఒక అద్దె కొంప. నిన్ను ఈ ఇంటిలో ఎందుకు వుండమన్నానంటే, ఈ కొంపలో ఉండి చక్కగా జన్మరాహిత్యం చేసుకో' అంటున్నాడు. నాయనా! ఈ శరీరానికి యజమాని నువ్వు కాదు. భగవంతుడే అసలైన యజమాని. అంటే మనం అద్దె కొంపలో నివసిస్తున్నామన్నమాట.

ఇంతకు ముందు జన్మలో అమ్మ కడుపులో వున్నప్పుడు 'ఓ దేవా! నాకు ఈ జన్మలు వద్దు. ఈ అద్దె కొంప వద్దు. నాకు మరో జన్మే వద్దు. దేవా! నన్ను నా స్వంత ఇంటికి తీసుకుపో!' అని దేవుణ్ణి ప్రార్థించి, మరుజన్మ రాగానే యధాస్థితికి రావడం, అనగా మరో జన్మకి రాగానే దేవుడికిచ్చిన మాట మరచిపోతాం. భగవంతుడు జీవితో 'నాయనా! నీవు కొన్నాళ్ళు ఈ అద్దె కొంపలో వుండి నన్ను తెలుసుకుని, నీ స్వంత ఇంటికి రా నాయనా! ఎందుకంటే ఈ ఇల్లు నాది, ఇది నీకు అద్దెకు ఇచ్చాను. ఏనాటికైనా నా ఈ ఇంటిని నేను తీసుకుంటాను. నేను బయటకు వెళ్ళమంటే నీవు వెళ్ళిపోవాలి' అన్నాడు. మొదట్లో జీవుడు అన్నింటికీ తల ఊపి, తరువాత ఈ దేహం మీద మమత్వం పెరిగి, 'అసలు ఈ శరీరం ఎందుకు వదలాలి నేను? ఈ శరీరం నాదే కదా. దేహాభిమానం వదలక, నేను ఈ శరీరాన్ని వదలను, అన్ని సుఖాలు నేను ఇక్కడే అనుభవిస్తాను' అంటాడు జీవుడు.

భగవంతుడు ఊరుకుంటాడా? వాడు మనకంటే తెలివిగలవాడు. ఈ లోకంలో ఇల్లు అద్దెకిచ్చినవాడు ఖాళీ చేయమంటే, అందులో అద్దెకున్నవాడు ఎంతకీ ఖాళీ చేయకపోతే యజమాని వెంటనే నోటీసు ఇస్తాడు. అలాగే భగవంతుడు కూడా మనకు మొదటి నోటీసు చత్వారం ఇస్తాడు. అనగా నీ బ్రతుకు ఇహ అయిపోవచ్చిందని. అయినా కూడా మొండిగా ఖాళీ చేయకుండా చత్వారం వచ్చినా ఫరవాలేదు, కళ్ళద్దాలు పెట్టుకుంటాను అంటాడు జీవుడు. అప్పుడు భగవానుడు 2వ నోటీసు ఇస్తాడు. అదేమంటే పళ్ళు ఊడిపోతాయి. అంటే బ్రతుకు ఇంకా ఛిద్రమవుతుందన్నమాట. దీని ద్వారా భగవంతుడు ఏం చెబుతున్నాడంటే, ఇప్పటికైనా తెలివి తెచ్చుకుని భగవన్నామం చేసుకోరా అని. నేను చెప్పినట్లు విను ఈ దేహం నీదికాదు, ఇది నాది అని. కానీ జీవుడు నాకేం ఫరవాలేదు. నేను కొత్తగా పళ్ళు కట్టించుకుంటాను అంటాడు. భగవంతుడు 3వ నోటీసు కూడా పంపుతాడు. అదే జుట్టు తెల్లబడిపోతుంది. అయినా కూడా ఈ జీవుడు భగవంతుని మాట ఖాతరు చేయకుండా, నేను ఈ జుట్టుకు నల్ల రంగు వేయించుకుంటాను అనుకుంటాడు. చివరకు యమధర్మరాజు వచ్చి ఆ ఇంటిని జప్తు చేస్తాడు. ఆ జీవును నుండి ఆత్మ లేచి వెళ్ళి పోతుంది. జీవుడు మరణిస్తాడు.

# శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహారాజ్ వారి సహస్ర నామావళిః

(గత సంచిక తరువాయి)

-పాలూరి ప్రసాద్

**31. ఓం పావనాయ నమః**

శ్రీ గురుదేవులు పరమ పావనమైనవారు. అగ్నికి అన్ని వస్తువులను పవిత్రమొనర్చే గుణం ఉన్నది. కానీ ఆ అగ్నికి కూడా పవిత్రతను ప్రసాదించిన పరబ్రహ్మ స్వరూపులు శ్రీగురుదేవులు. ఎంతటి మురికి నీరైనా గంగా నదిలో చేరగానే గంగాజలమైనట్లు ఎంతటి పాపులైనా శ్రీగురుదేవులను ఆశ్రయిస్తే పవిత్రులౌతారు.

**32. ఓం పరమానందాయ నమః**

బ్రహ్మానంద వారధిలో తాము నిత్యము ఓలలాడుతూ, తమను ఆశ్రయించిన వారిని అట్టి ఆనందములో మునకలు వేయించు శ్రీగురుదేవులు అట్టి పరమమైన ఆనందానికి అధిపతులు. పరమానందము అనగా ఈ ప్రపంచములో ఉండే ఆనందములన్నిటికీ అతీతమైన బ్రహ్మానందము. ప్రాపంచిక ఆనందములన్నీ దుఃఖముతో కూడుకొన్నవి. మార్పు కలిగినవి. కానీ ఆ ఆనందము నిత్యమైనది. శాశ్వతమైనది.

**33. ఓం ప్రసిద్ధాయ నమః**

ప్రకృష్టమైన సిద్ధులు శ్రీగురుదేవుల పాదములను సదా ఆశ్రయించి వారి సేవలో సదా నిమగ్నమై ఉంటాయి. మనకు ప్రతి దినమూ సూర్య భగవానుని శక్తి ఎలా అనుభూత మవుతోందో అదే విధముగా సత్య గురుదేవుల శక్తి ప్రతి క్షణమూ మనకు అనుభూతమవుతూనే ఉంటుంది. వారికి ఏ ప్రచారములు అవసరము లేదు.

**34. ఓం భక్త వత్సలాయ నమః**

"ఆవు పొదుగునుండి దూడను వేరు చేసేటప్పుడు ఆవుపడే బాధ ఎలా ఉంటుందో, మీరందరూ నావద్ద సెలవు తీసుకుని వెళ్తుంటే అలా ఉంటుంది నాకు" అనేవారు శ్రీగురుదేవులు. శ్రీ గురుదేవులకు తమ భక్తులయందు గల వాత్సల్యము అంత అపారమైనది. ఈ జన్మలో మనకు దేహాన్ని ఇచ్చిన మాతృమూర్తియే మన యెడల అపార వాత్సల్యమును చూపుచుండగా జన్మజన్మలకూ మనకు తల్లియైన గురుదేవుని వాత్సల్యమును ఎవరు వర్ణించగలరు? మనము నిజముగా వారిని గూర్చి పరితపించిన నాడు వారు వెంటనే మన ముందు ఉంటారు.

**35. ఓం నిత్యా నిత్య వివేకైక పరిజ్ఞాన సమన్వితాయ నమః**

ఈ ప్రపంచములో నిత్యమైనదేదో అనిత్యమైనదేదో బాగుగా తెలిసిన వారు శ్రీగురుదేవులొక్కరే. నిజానికి ఈ ప్రపంచములో నిత్యమైనది శ్రీగురుదేవులు మాత్రమే. మరి వారిని గూర్చి వారికన్న మిన్నగా ఎవరు తెలిసికొనగలరు? మనకు కూడా అటువంటి

నిత్యానిత్య వివేకాన్ని ప్రసాదించగలిగినది సత్యగురుదేవులొక్కరే.

**36. ఓం త్రికాలజ్ఞాయ నమః**

శ్రీగురుదేవులు త్రికాలజ్ఞులు. అనగా భూత, భవిష్యత్, వర్తమాన కాలములను బాగుగా తెలిసినవారు. నిజానికి మూడు కాలములందు నిత్యమై మార్పు లేకుండా ప్రకాశించేది గురుదేవులు ఒక్కరే. శిష్యునిలోని భావ రుగ్మతలను ముందే కనిపెట్టి నిర్మూలించగలవారు వారు ఒక్కరే. 'నీలో సంకల్పం కలగటానికి ఆరునెలలముందే అదినాకు తెలుస్తుంది. అన్నీ తెలిసిన బాధనాది. యేమీ తెలియని బాధమీది' అనేవారు శ్రీగురుదేవులు.

**37. ఓం స్థిత ప్రజ్ఞాయ నమః**

శ్రీ గురుదేవులు స్థిత ప్రజ్ఞులు. అనగా తనలో ఎన్ని నదులు వచ్చి కలిసినా సముద్రము ఎలా గంభీరంగా, స్థిరంగా ఉంటుందో, అలాగే శ్రీ గురుదేవుని ఏ సుఖదుఃఖాలు, ద్వంద్వాలు చలింప చేయలేవు. వారు రాగ ద్వేషాలకు అతీతులు. మాయ సదా వారికి లోబడియే ఉంటుంది.

**38. ఓం భావాతీతాయ నమః**

శ్రీగురుతత్వం మన భావాలకు, భాషకు అతీతమైనది. దానిని ఎవరికి వారు అనుభవించి తెలుసుకోవలసినదే గానీ భావ వ్యక్తీకరణ ద్వారా ఒకరి నుండి మరియొకరు పొందలేనిది. అది వారు అంతర్గతంగా అందిస్తేనే మనం అందుకోగలం గానీ బాహ్యంగా తెలుసుకోలేం.

**39. ఓం సనాతనాయ నమః**

శ్రీ గురుదేవులు సనాతనులు. అనగా సృష్టికి పూర్వం నుంచీ ఉన్నవారు. ఎప్పటికీ శాశ్వతంగా ఉండేవారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు కూడా కారణభూతమైన పరబ్రహ్మ స్వరూపులు. నిత్యులు, శాశ్వతులు. అందరికన్నా పూర్వులు. "ఎన్నో జన్మలనుండి నాతోనే ఉన్నావు. ఒక్కసారి నన్ను ఆశ్రయిస్తే కామవరపు కోట జీడిలాగ ఇంకెన్ని జన్మలైనా, నన్ను తెలుసుకునే వరకు వదలను" అనేవారు సద్గురుమూర్తి. వారు నిత్య యవ్వనులు.

**40. ఓం జితకామాయ నమః**

బ్రహ్మాండమంతా నిండియున్న జగద్గురుదేవులు మనకోసము, మనవలె దేహము ధరించి అవతరించుట వలన వారికి యీ దేహముతో పనిలేదు. అందువలన వారికి ఈ జగత్తులో కోరవలసినది గానీ, తనది కాని వస్తువు కానీ ఏదీ లేదు. మన్మధ జనకుడైన శ్రీమన్నారాయణుడు, మన్మధుని భస్మం చేసిన పరమేశ్వరుడు కూడా వారే. మన్మధునే మోహింపజేయగల శ్యామసుందరుడు, మదన మోహనుడు శ్రీగురుదేవులు.

- సశేషం

# శ్యామ సుందరా! ఒక్కసారి,
# ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ!

- కీ.శే. రమణ ప్రసాద్

మన మహాకావ్యాలలో ఎందరో నాయకుల వర్ణనలు కనిపిస్తాయి. కాల ప్రవాహంలో ఎన్ని వేల సంవత్సరాలు గతించినా, కాలంతో సంబంధం లేకుండా వారిలో కొందరు మన సాంస్కృతిక పరంపరపై తమ ప్రభావాన్ని చూపించి ప్రధాన పురుషులుగా నేటికీ ప్రకాశిస్తున్నారు. వారి రూపలావణ్యములు, వారి గుణ గణములు, వారి సౌశీల్యము, వారు ఆచరించి చూపిన ఆదర్శము మనల్ని ఎంతగానో ఆకట్టుకుని వారినే దైవంగా భావించేటట్లు చేశాయి. అట్టివారిలో కృష్ణుడు ఒకడు. ఎంతో మానవతా వాది కనుకనే మనందరికీ అత్యంత ఆత్మీయుడు, మనవాడు, మనందరివాడు.



పదునెనిమిది రోజులు జరిగిన మహా మారణహోమరూప భారతయుద్ధం ముగిసింది. ఎందరో వీరులు మరణించారు. మరెందరో క్షతగాత్రులైనారు. ఆ యుద్ధం పరిసమాప్తి అయిన తరువాత కృష్ణుని అనంతలీలలో రెండవ అధ్యాయం - యాదవ కుల వినాశం, దానితో ముడిపడిన శ్రీకృష్ణుని అవతార లీలా వుపసంహారము - ప్రారంభమవుతుంది.

మహాభారతయుద్ధ పరిసమాప్తి వరకు శ్రీకృష్ణుని జీవితంలో ఎవరెవరి జీవితాలు ముడిపడి ఉన్నాయో వారందరికీ శ్రీకృష్ణుని నిర్యాణం అశనిపాతంలా తగుల్తుంది. వారి సంక్షుభిత హృదయాలలో ఒక బాధా కెరటం ఉవ్వెత్తున లేచి అందరినీ ముంచివేస్తుంది. అందరికీ హృదయాన్ని పిండివేస్తున్న చెప్పలేని ఒక మూగబాధ. కరుణ, పశ్చాత్తాపము, వాత్సల్యము, విస్మయము కలిగించే శ్రీకృష్ణుని ముగ్ధ మనోహరరూపము, ఆయన చేసిన అనేక లీలలు వారి స్మృతిపథంలో మెదుల్తాయి. అంతా అయిపోయింది. తెరిచిన గుప్పెటనుండి ఇసుక

జారిపోయినట్లుగా కాలం చేజారిపోయింది. ఇక ఇప్పుడు చేయగలిగింది ఏముంది?

ఆ మహా నిర్వేదంలో ఒక మూగబాధ తటిల్లతలాగ వారి అంతరంగాలలో తళుక్కున మెరిసి వారి మనస్సు - ఓ శ్యామసుందరా! ఒక్కసారి, ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవా, అని మూగగా ఘోషిస్తుంది. ఇక్కడనుండే కథా రచన ప్రారంభమవుతుంది.

అర్జునుడు ద్వారకకు వెళ్ళుట -

అప్పటివరకు ప్రచండంగా నిప్పులు కురిపించిన సూర్యుడు పశ్చిమాద్రిని చేరబోతున్నాడు. అస్తమిత సూర్యుని నిస్తేజమైన కిరణాలు ద్వారకలోని సౌధాగ్రాలపైన, బురుజులపైన ఉదాసీనత అనే ముసుగును కప్పతున్నట్లుగా పరచుకొన్నాయి. ద్వారకకు దక్షిణంవైపు ఉన్న మహోన్నతమైన రైవత పర్వత సుదీర్ఘ ఛాయ, విషాదంతో ఆ పర్వతం తల వాల్చుకున్న భంగిమను తలపింపజేస్తున్నది. ద్వారకను పరివేష్టించి ఉన్న సముద్రపు అలలు చేస్తున్న ధ్వని యుద్ధంలో క్షతగాత్రులైనవారు బాధతో మూలుగుతున్నట్లుగా వినిపిస్తున్నది.

కుడివైపు పచ్చిక బయళ్లలో అచేతనంగా ప్రాన్పడి పచ్చిక మేయడం సైతం మానిన ఆవుల మూసిన కన్నులనుంచి అశ్రుధారలు కారుతున్నాయి. అవి రథచక్రాల ధ్వనికి, గుర్రపు డెక్కల చప్పళ్లకు బలవంతంగా కనురెప్పలు కొద్దిగా తెరిచి చూసి, చెవులు రెప రెపలాడించి తోకలు విదిలించాయి. మహా అయితే కాసిని ఈగలు ఎగిరిపోయాయేమో! ఎడమవైపున ఉన్న మార్గం రైవత పర్వతపు నీడను స్పృశిస్తూ దక్షిణదిక్కుగా సాగిపోతోంది.

క్రమంగా రథాలు వెళుతున్నప్పుడు లేచిన దుమ్ము, రథచక్రాల సవ్వడి, గుర్రపుడెక్కల చప్పళ్ళు, ప్రక్కనే నడచివస్తున్నవారి పాదాల గుర్తులు నిశ్శబ్ద నీరవ నిశీథిలో కరిగిపోతున్నాయి.

పరుగులు తీస్తున్న అశ్వాల కళ్ళాలను కుడిచేతితో పట్టుకున్న దారుకుడు రైవతము వైపు దృష్టి సారించాడు. అలసిపోతున్న అశ్వాలు తెల్లటి నురగను కక్కుతున్నాయి. రథవేగం తగ్గింది.

- సశేషం

# నారద భక్తి సూత్రములు

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**భక్తి సూత్రము 37: లోకేపి భగవద్గుణ శ్రవణ కీర్తనాత్**

తాత్పర్యము: లోకములో ప్రవర్తిస్తూనే భగవంతుని గుణములను శ్రవణము చేసి కీర్తించుట వలన (పరా భక్తిని పొందవచ్చు)



ఈ సూత్రము ద్వారా నారదులు మహాత్ములు లోక సంగ్రహార్థము సామాన్యుల వలే కనిపిస్తూ నిత్య కార్యక్రమములను నిర్వర్తిస్తారని, సాధకుడు దానిని చూసి భ్రమపడరాదని హెచ్చరిస్తూనే సాధకుడు నిరంతరము భగవంతుని గుణముల శ్రవణ మననముల ద్వారా తరించ వచ్చని వివరిస్తున్నారు.

లోకములో ఉన్నంతవరకు లోక ధర్మములను పాటింపక తప్పదు. ముక్తులు మరియు మహాత్ములు కూడా లోక సంగ్రహార్థము అనేకమైన కార్యక్రమములను చేపడతారని మనకు తెలిసిన విషయమే. శ్రీ బాబుజీ మహారాజ్ వారు సాధకులను ఉద్ధరించడానికి ఎన్నెన్నో యాగములను పూజలను చేయించారు. శ్రీ మాతాజీ వారు అదే ప్రక్రియని ఈనాటికీ కొనసాగిస్తున్నారు. అయితే మహాత్ములు ఈ కార్యక్రమములను నిర్వర్తింపజేసే సమయంలో నిత్య తృప్తులై అసంగులై ఉంటారు. దీనిని గీతాచార్యులు భగవద్గీతలో వివరిస్తూ

**సక్తాః కర్మణ్యవిద్వాంసో యథా కుర్వంతి భారత ।**
**కుర్యాద్విద్వాంస్తథాసక్తః చికీర్షుర్లోకసంగ్రహమ్ ॥**

అంటూ జ్ఞానులు లోక క్షేమము కొరకు కర్మలను ఆచరిస్తారని తెలియజేశారు.

దేహం లౌకిక ధర్మములో మునిగి ఉన్నపుడు సాధనను మానసికముగా చేసుకొనడానికి భగవంతుని శ్రవణము మరియు కీర్తన మొదలైనవి దోహదపడతాయి. సాధకుడు ఆ విధంగా లోకంలోని కార్యక్రమములను నిర్వర్తిస్తున్నప్పటికీ భగవంతుని స్మరణ మరువరాదని ఈ సూత్రము గుర్తుచేస్తుంది. దీనిని గురించి బాబూజీ మహారాజ్ వివరిస్తూ ఒక చేతితో గురుపాదము ఆశ్రయించి మరొక చేతితో లోకములోని వ్యవహారములు నిర్వర్తించి తిరిగి ఆ చేతిని కూడా స్వామి వారి పాదములపై చేర్చి తరించగలగడమే నిజమైన సాధకుని కర్తవ్యమని బోధించారు.

ఇటువంటి సాధకులు దృఢవ్రతులై తనను సేవిస్తారని (**సతతం కీర్తయంతో మాం యతంతశ్చ దృఢవ్రతాః**) గీతాచార్యులు వివరించారు.

నిరంతరము మనసులో భగవంతుని శ్రవణ కీర్తనమును చేసే సాధకుడు బ్రహ్మనిష్ఠుడై కర్మలో అకర్మను చూడగలుగుతారని ఈ సూత్రము వివరిస్తుంది.

**భక్తి సూత్రము 38: ముఖ్యతస్తు మహత్కృపయైవ భగవత్కృపాలేశాత్ వా**

తాత్పర్యము: ఈ సిద్ధికి మహాత్ముల కృప గానీ లేక భగవంతుని కృపాలేశము గానీ చాలా ముఖ్యము. ఈ సూత్రము ద్వారా నారదులు ముందు సూత్రములో తెలుపబడిన భగవద్గుణ శ్రవణ కీర్తనాదులకు కావలసిన కృపా విశేషములను తెలియజేస్తున్నారు.

ముందు సూత్రములో తెలుపబడిన భగవద్గుణ శ్రవణ కీర్తనలు చేయడానికి సాధకులందరికీ సాధ్యం కాదు. మహాత్ముల యొక్క కృప కాని, భగవంతుని కృపాలేశముగాని ఉన్నప్పడే తత్ఫలితముగా సత్సంగము వలన సాధకుని మనస్సు ఆసక్తిని చూపగలుగుతుంది.

ఈ సూత్రమున నారదులు "మహాత్ముల కృప" మరియు "భగవంతుని కృప" అని రెండు మార్గములను చూపించినట్లుగా కనబడుతున్నప్పటికీ నిజానికి భగవంతుని కృప కలిగినప్పుడు ఆ భగవంతుడే సాధకుని ఉద్ధరించడానికి గురుదేవుని రూపములో అవతరిస్తాడని గ్రహించాలి.

అయితే భగవంతుడు కృపా సముద్రుడై ఉన్నప్పుడు కొంతమంది యెడలనే ఆ అనుగ్రహము ఉంటుందని భావించడం సరికాదు. సూర్యుడు అందరి యెడల సర్వ సమానుడై ప్రకాశించుచున్నప్పటికీ గదిలో తలుపు మూసి కూర్చున్న వాడికి ఆ కిరణములు సోకని విధముగా భగవంతుని పట్ల ఆసక్తి మరియు ప్రేమ లేని వాడికి ఆ అనుగ్రహము పొందే పాత్రత ఉండదు. స్మరణ వలన ప్రీతి ఏర్పడి వాసనలు తగ్గి భగవంతుని పట్ల ఆసక్తిని చూపించిన సాధకుడిని తరింప చేయడానికి గురువే వారి దగ్గరకు విచ్చేసి వారిని ఉద్ధరిస్తారు. కానీ గురుదేవుల పట్ల అనన్య భక్తిని కలిగి వుండడం మాత్రం సాధకునికి చాలా ప్రధానము. దీనిని గురించి గీతాచార్యులు వివరిస్తూ

**తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత।**

**తత్ప్రసాదాత్పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్॥**

అంటూ అనన్య భక్తి ద్వారా మాత్రమే తన నిత్య శాశ్వత ధామమును చేరుకొనగలరని తెలియజేశారు. భగవంతుని చేరడానికి స్వయం సత్తా సరిపోదని గురుదేవుల అనుగ్రహము చాలా ముఖ్యమని "**గురుస్సాక్షాత్ పరబ్రహ్మ**" అన్న మహా మంత్రమును ఈ సూత్రము ప్రతిపాదిస్తోంది.

**భక్తి సూత్రము 39: మహత్సంగస్తు దుర్లభో అగమ్యో అమోఘశ్చ**

తాత్పర్యము: మహాత్ముల సాంగత్యము దుర్లభము, అగమ్యము మరియు అమోఘము.

ఈ సూత్రము ద్వారా నారదులు మహాత్ముల సాంగత్యము ఎంతో విశేషమని దానిని పొందడం ఎన్నో జన్మల సుకృత ఫలమని అటువంటి సాంగత్యమును సాధకుడు దుర్వినియోగం చేసుకోరాదని తెలియజేస్తున్నారు గీతాచార్యులు

**మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే।**
**యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః॥**

అని వివరించినట్లు నిక్కమైన మహాత్ములు చాలా అరుదుగా ఉంటారు. అటువంటి వారిని గుర్తించడము కూడా చాలా కష్టమే. వారు బాహ్య దృష్టికి మహాత్ముల వలే గోచరించరు. వారి తత్వమును గ్రహించగలిగిన వారికి మాత్రమే వారి యదార్థము బోధపడుతుంది. శ్రీ బాబూజీ మహారాజ్ వారి పూర్వాశ్రమంలో ఎంతో నిరాడంబరముగా ఉండి సామాన్యుల వలె ప్రవర్తించేవారు. గాఢమైన భక్తి విశ్వాసములు ఉన్నవారికిగానీ శ్రీ గురుదేవుల యధార్ధతత్వము బోధపడేది కాదు. అటువంటి సద్గురువుని ఆశ్రయించడం సాధకుని యొక్క అదృష్ట ఫలము. ముందు సూత్రములో తెలుపబడినట్లు భగవదనుగ్రహము కలిగిన సాధకులని మాత్రమే సద్గురువులు అనుగ్రహించి ఉపదేశిస్తారు. అయితే ఆ ఉపదేశ విధానము శిష్యునకు అగమ్యముగా (అర్థం కాని విధముగా) ఉంటుందని ఈ సూత్రం తెలియజేస్తోంది. ఎందుకంటే గురుదేవులు స్పర్శ, దర్శన, దృష్టి ద్వారా తరింప చేయగలుగుతారు. అయితే వారు ఎవరిని ఏ విధంగా తరింప చేస్తారు అన్నది సామాన్యులకు అందని విషయము. దీని గురించి శ్రీ బాబూజీ మహారాజ్ "మీకు తెలియని బాధ నాకు తెలిసిన బాధ" అని వివరించేవారు.

అయితే ఇటువంటి మహాత్ముల సందర్శన ఉపదేశాది భాగ్యము ఎప్పటికీ వృధా పోదు అని, అది "అమోఘము" (వృధా కానిది) అని నారదుల వారు తెలియ చేస్తున్నారు. అయస్కాంతము ఇనుప ముక్కను ఆకర్షించినట్లు మహాత్ముల అనుగ్రహము భక్తుల మనస్సులను ఆకర్షించి క్రమక్రమముగా వారిని ఉన్నత స్థితికి తీసుకొని వెళ్ళి చివరికి ఆత్మసాక్షాత్కారమును కూడా కలుగజేస్తుంది.

అయితే ఏ సాధకుడికి ఎప్పుడు సిద్ధి కలుగుతున్నదో సామాన్యునికి అర్థం కాని విషయము. వారి వారి సాధనను బట్టి, వారి కర్మ శేషములను బట్టి, త్వరితముగానో లేక ఎన్నటికో కాలాంతరమునకో కలుగుతుంది కానీ ఎప్పటికీ వృధా కాదని నారదుల వారు ఈ సూత్రము ద్వారా వివరిస్తున్నారు.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**<u>జులై 2025</u>**

6 ఆది: తొలి ఏకాదశి - ఏకాహం సంకీర్తన, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

10 గురు: ఆషాఢ పూర్ణిమ - గురుపూర్ణిమ. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

16 బుధ: కర్కాటక సంక్రమణం - దక్షిణాయన పుణ్యకాల ప్రారంభం

20 ఆది: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

23 బుధ: మాసశివరాత్రి

24 గురు: అమావాస్య

27 ఆది: శ్రావణ శుద్ధ తదియ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

**<u>ఆగస్ట్ 2025</u>**

8 శుక్ర: వరలక్ష్మీ వ్రతం

9 శని : శ్రావణ పూర్ణిమ - రాఖీ పూర్ణిమ, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

16 శని : శ్రీ కృష్ణాష్టమి - కలశస్థాపన, శ్రీ రాధాకృష్ణ సహస్రనామార్చన, భక్త సమారాధన. రాత్రి 7.00 గం. లకు శ్రీ సద్గురు పాదపూజ.

17 ఆది: శ్రీ కృష్ణాష్టమి - ఉ.11.00 గం.లకు సామూహిక శ్రీ రాధాకృష్ణ సహస్రనామార్చన, భక్త సమారాధన.

18 సోమ: శ్రీ గురుదశమి - ఏకాహం, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

21 గురు: మాసశివరాత్రి

23 శని : అమావాస్య

27 బుధ: వినాయకచవితి - తె.జా.5.30 గం.లకు శ్రీ సద్గురు పాద పూజ. ఉ.11.00 గం.లకు సామూహిక వినాయకచవితి పూజలు, భక్త సమారాధన.

# కవరేజ్ ఏరియా

- పెనుమాక నాగేశ్వర రావు

కోరికల్లేకుండా భక్తి కలుగుతుందా! అని ఓ మిత్రుడి సందేహం. .కోరికలు తీరకుండా భక్తి నిలబడుతుందా! అని మరో మిత్రుడి సంశయం. కోరికలకీ, భగవంతుడికి అనుసంధానమయినది భక్తా! అని మరో మిత్రుడి సందిగ్ధం. కోరికల్లేకుండా చేయమని భగవంతుడిని అడగటమే భక్తులు చేయాల్సిన పని అని పెద్దల సందేశం.

చాలా ఏళ్ల క్రితం ఓ తెలుగు వారపత్రికలో చదివిన సంపాదకీయం బాగా గుర్తుండిపోయింది. మనసుకు అంతగా పట్టుకుంది. సింహాచలం అప్పన్న ఆలయంలో కప్పస్తంభం ఉంటుంది కదా. ఆ స్తంభం ప్రత్యేకతని అక్కడి అర్చక స్వామి సందర్శకులకి వివరిస్తుండటం, ఆ వివరణ ఓ ఇద్దరు యువతులు వింటుండటం జరుగుతుంది. ఆ కప్ప స్తంభాన్ని కౌగిలించుకుంటే స్త్రీలు గర్భవతులు అవుతారని నమ్మకం చాలా మందిలో ఉన్నదని, రుజువులు కూడా వున్నాయని ఆయన చెప్పటం విన్న ఆ ఇద్దరు యువతులు ఎగతాళిగా మాట్లాడుకోవటం ఆ పూజారి కొడుకు వింటాడు. అతను గుడి లోపల ఉండి ఈ తతంగం అంతా గమనిస్తూ, ఆలకిస్తుంటాడు .

గర్భగుడిలోనుంచి అతను కప్ప స్తంభం దగ్గరకు వచ్చి, తండ్రిని గర్భగుడిలోకి పంపిస్తాడు. సరిగ్గా ఆ సమయంలో ఆ స్తంభం దగ్గర వున్న యువతులు ఇద్దరూ ఆ పూజారి కొడుకుకు మళ్ళీ తమ సందేహం వెలిబుచ్చుతారు. 'ఏమండీ ఈ స్తంభాన్ని కౌగిలించుకుంటే ఆడవారు తల్లులవుతారట నిజమేనా?' అని. అందుకు బదులుగా అతను 'ఏమోనండీ, అలా పాతకాలంలో చెప్పకునేవారని మా నాన్నగారు చెబుతుంటేనే నేనూ విన్నాను. కానీ ఇటీవలి కాలంలో మాత్రం చాలామంది ఈ కప్పస్తంభాన్ని కౌగిలించుకుంటే విదేశాలు వెళ్ళేందుకు వీసాలు వస్తున్నట్లు చెప్పకోవడం నేను స్వయంగా విన్నాను" అని చెబుతాడు.

అతని మాటలు పూర్తి అయ్యీ కాకముందే ఆ యువతులు ఇద్దరూ చేతుల్లో ఉన్న హాండ్ బ్యాగుల్ని కిందపడేసి కప్పస్తంభాన్ని కౌగిలించుకుంటారు. సారాంశంగా ఆ సంపాదకీయంలో చివరి వాక్యం

ఏమిటంటే.. భారతదేశంలో కోరికలు మారుతున్నాయేమో కానీ, నమ్మకం మాత్రం మారటంలేదు, సడలటం లేదు అని చెబుతాడు. వాస్తవం అనిపించింది.

ఈ ఉదాహరణలో ఆ అమ్మాయిలకు వీసా వస్తే భక్తి కలుగుతుంది, లేకపోతే లేదు. అనుకుంటే కోరికలు ఉండాలి. అవి తీరాలి. అప్పుడు భక్తి పుడుతుంది. పెరుగుతుంది. అలా నిలబడిన భక్తి బలపడి అసలైన భక్తి అంటే కోరికలు కోరుకోవడం, తీర్చుకోవడం కాదని తెలుసుకోవటం జరుగుతుంది. అలా భక్తి నిశ్చలమైతే, మనసు నిర్మలమై, ప్రశాంత మనస్కులమైపోతాం.



అలాగే ఆ మధ్యన వాట్స్‌యాప్‌లో ఓ మెసేజ్ చదివిన గుర్తు. సురేష్ తన తోటలోని అరటిచెట్లలోని 100 అరటిపళ్ల గెలను కోసి తన ఇంటి పనివాడైన రాముని పిలిచి గుడిలో ఈ గెలను ఇచ్చి రమ్మని చెప్పాడు. రాము 'అలాగే అయ్య గార'ని చెప్పి వెళ్ళాడు. ఆరోజు రాత్రి సురేష్‌కి దేవుడు కలలో కనిపించి, 'సురేష్ నువ్వు పంపిన ఒక్క అరటిపండు నాకు అందింది' అని చెప్పాడు.

ఉలిక్కిపడి లేచి సురేష్ ఆశ్చర్యపోయాడు. 'నేను 100 పళ్ళు పంపితే దేవుడు ఒక్కటే అందిందని అంటున్నాడే' అని రాముని పిలిచి వెంటనే అడిగాడు. రాము 'అయ్యా! నేను గుడిలో గెలను ఇచ్చానయ్యా' అని చెప్పాడు. సురేష్ కి కోపం వచ్చి, కాస్త గట్టిగా అరిచాడు. రాము నిజాయితీగా నువ్వు చేసిన తప్పు ఒప్పుకో అన్నాడు. రాము భయపడి పోయి 'అయ్యా నిజం చెప్పేస్తాను. గుడికి వెళ్ళే దారిలో ఒక అతను చాలా ఆకలిగా ఉందని అడిగాడు. అతనికి ఒక్క పండు ఇచ్చాను. మిగతా అంత గుడిలో ఇచ్చాను' అని చెప్పాడు. అప్పుడు అర్థం అయ్యింది సురేష్‌కి 'ఆకలితో ఉన్నవాడికి ఇచ్చిన పండు ఆ పరమాత్ముడికి చేరుతుంది' అని. గుడిలో లక్షలు పోసి హెూమాలు చేయడం కాదు, ఆకలి అనేవారికి అన్నం పెట్టడం ఆ దేవుడికే సేవ చేసినట్టు. పేదవారికి మనం చేసే సాయం ఆ భగవంతుడితో మన మొర ఆయనకు ప్రత్యక్షంగా విన్నవించుకున్నట్టే...

అందుకేనేమో దాదాపు మన కాశీవనాశ్రమ శాఖలన్నింటిలోనూ అన్నదాన కార్యక్రమాలు ఆరంభింపజేశారు గురుదేవులు, పూజ్యశ్రీ మాతాజీ సారధ్యంలో.

పుణ్యక్షేత్రాలకు, ధర్మక్షేత్రాలకు అతీతమైనది గురుక్షేత్రం. అందుకే గురుపాద సన్నిధి, స్థిరమైన పెన్నిధి అని పాడుకుంటున్నాం. అందువల్లనే ఆ సద్గురుదేవుల అభయహస్త నీడలోకి ప్రవేశించిన మరుక్షణం నుంచి మనం కవరేజ్ ఏరియాలోనే ఉంటాం.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......

**జులై 2025**

6 ఆది: తొలి ఏకాదశి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

10 గురు: ఆషాఢ పూర్ణిమ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

20 ఆది: శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

**ఆగస్ట్ 2025**

9 శని : శ్రావణ పూర్ణిమ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

16 శని : శ్రీ కృష్ణాష్టమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

18 సోమ: శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

27 బుధ: వినాయకచవితి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

సముద్రతీరము చెంత నిలిచిన వానరులు ఆశ్చర్యముతోను, కలతతో కూడినవారై, 'ఇకపై ఏమి చేయగలము?' అని ఆలోచనలో మునిగిపోయారు. "మనకు అప్పగించిన సమయం అయిపోయింది. నాకు ఇకపై సీతను చూడగలమను నమ్మకమూ పోయింది. సీత కనబడలేదను వార్తతో కిష్కింధకు వెళ్ళినట్లైతే పినతండ్రి నన్ను చంపివేస్తారు. కావున నేను ఇచ్చోటనే నిరాహారదీక్ష చేస్తూ ప్రాణత్యాగము చేసెద"నని తెలియజేసి దర్భలను పరచి ఆసనం తయారు చేసుకుని దానిపై కూర్చున్నాడు అంగదుడు. ఆతనిని చూసి అన్య వానరులంతా ఆతనిని అనుసరించి అక్కడే కూర్చుండిపోయారు.

కాస్తంత దూరంలో ఉన్న కొండపైనుండి వీరందరినీ గమనిస్తున్న ఒకవృద్ధ ప్రాయమును చేరుకున్న పెద్ద పక్షి మిక్కిలి ఆనందంతో 'హమ్మయ్య.. ఈ వానరగుంపు ఇలానే ప్రాణత్యాగమొనర్చినట్లైతే నాకు కొద్దిరోజులవరకు ఆహారమును గూర్చిన బాధ ఉండదు' అని మనసులో తలచింది.

సముద్రమందు స్నానమాచరించి వచ్చిన హనుమంతుడు, జాంబవంతుడు అంగదుని జూచి, "కిష్కింధ యువరాజైన నీవే ఇలా నమ్మకమును వీడవచ్చునా!? సీతను చూడలేకపోతేనేమి? మనమందరమూ కలసి ఎలాగైనా లంకానగరమునకు వెళ్ళి రావణునితో పోరాడవలయును. వృద్ధుడైన జటాయువు ఎట్టి భయమూ చెందక రావణునితో భీకరముగ పోరాడి తన ప్రాణములను విడువలేదా!? మనము కూడ ఆ విధముగనే ఆ రావణునితో యుద్ధము జేయ వలయును" అని హనుమంతుడు తెలిపాడు.

జటాయు నామమును హనుమ ఉచ్ఛరించిన వెంటనే కొండపైనున్న పక్షి "ఏమిటి? జటాయు, నా ప్రియ సోదరుడు ప్రాణములు విడిచాడా?" అని రోదించి, "వానరులారా! రెక్కలు లేని నన్ను ఈ కొండపైనుండి క్రిందకు దించండి. నేనుమీతో కాస్త మాటలాడ వలయును" అని అరిచాడు. హనుమ ఆ పక్షిని చూసి దానిని మెల్లగ

క్రిందకు దించాడు. "ఓ వానరులారా! నాపేరు సంపాతి. నేను, నా సహోదరుడు జటాయువు అరుణుని పుత్రులము. నా సోదరుడ్ని రావణుడు సంహరించాడా? ఆ వివరములనన్నింటినీ నాకు తెలియజేయుము" అన్నది ఆ పక్షి.

జాంబవంతుడు జటాయువు మరణించిన విధమును వివరించాడు. "రాముని భార్యయైన సీతాదేవిని అపహరించుకు పోవుచున్న రావణుని అడ్డుకొన జటాయు తన రెక్కలతో అనేక విధముల పోరాడింది. ఆగ్రహము చెందిన ఆ అసురుడు తనకు ఈశ్వరునిచే ప్రసాదించబడిన కరవాలమునుపయోగించి జటాయువు యొక్క రెక్కలను నరికివేయడమేగాక ఆతనిని కొన ఊపిరితో వదలివేసాడు. సీతను వెదకుచూ అచ్చటకరుదెంచిన రామునితో జటాయువు జరిగిన వృత్తాంతమును వివరించి ప్రాణములను విడిచాడు".

సంపాతి జటాయువు ధీరత్వమును మెచ్చుకుని, "నేను కూడ ఆ రాక్షసుడు ఒక స్త్రీని అపహరించి, వాయువ్య దిశవైపుకు గైకొనిపోవుటను గమనించాను. ఆతడేనా రావణాసురుడు?"

హనుమంతుడు సంపాతితో, "మీరు మాకు ఒక సహాయం చేయవలయును. మీయొక్క సూక్ష్మబుద్ధితో రావణుడు వెడలిన దిక్కున ఆతడు సీతాదేవిని ఎచ్చట బంధించియుంచాడో గ్రహించి, మాకు తెలియ జేయవలయును" అన్నాడు.

సంపాతి మరల తనను తన గుహలో చేర్చమని హనుమను కోరాడు. హనుమంతుడు ఆతని కోరికను తీర్చగ, ఆతడు తనకుగల దివ్యదృష్టిచే, లంకానగరమునందున్న అశోకవనములో రాక్షసస్త్రీల నడుమ సీత పడుతున్న బాధలనన్నింటినీ వివరించాడు. అలా ఆ వానరులంతా సంపాతి తెలియజేయుచున్న వివరములను ఆలకించు చుండగా, వారు ఆశ్చర్యపడు విధమున ఆ పక్షికి రెక్కలు మరల మొలవడం ఆరంభించాయి. "ఆహా! సూర్యభగవానుడా! 'రామ కార్యమునకు సహకరించినచో కాలిపోయిన మీ రెక్కలు మరల పెరుగును' అని గతంలో చెప్పిన విధముగనే జరిగింది" అని తన గత చరిత్రను తెలియజేయ నారంభించాడు.

- సశేషం

## శ్రీకృష్ణాష్టమి కార్యక్రములు (శ్రీకాళీగార్డెన్స్ నంబూరులో)

15-8-25 శుక్రవారం- ఉ.8.01 గం.లకు బృందావన ప్రదక్షిణ, అనంతరం కలశస్థాపన, శ్రీరాధాకృష్ణుల సహస్రనామార్చన. ఉ.10.00 గం.లకు శ్రీ కాళీకా పరమేశ్వరీ అమ్మ వారికి లక్ష కుంకుమార్చన. మధ్యాహ్నం 12 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ. భక్త సమారాధన. సాయంత్రం 5.30 గం.లకు లఘు ప్రార్ధన, శ్రీ శ్రీనివాస రామానుజదాసు గారి ప్రవచనం, సత్సంగం.

16-8-25 శనివారం- ఉ.6 గం.లకు శ్రీరాధాకృష్ణుల సహస్రనామార్చన. 10 గం.లకు శ్రీ శ్రీనివాస రామానుజదాసు గారి ప్రవచనం, సత్సంగం, భక్తసమారాధన. సా॥ 5.30 గం.లకు లఘుప్రార్ధన, శ్రీ సద్గురు పాదపూజ.

17-8-25 ఆదివారం - ఉ. 6 గం.లకు శ్రీరాధాకృష్ణుల సహస్రనామార్చన. 11గం.లకు శ్రీరాధకృష్ణుల సామూహిక పూజలు, అనంతరం భక్తసమారాధన. శ్రీ శ్రీనివాస రామానుజదాసు గారి ప్రవచనం,

18-8-25 సోమవారం-శ్రీగురుదశమి- ఉ. 6 గం.లకు శ్రీరాధాకృష్ణుల సహస్రనామార్చన. ఉ.10 గం.లకు శ్రీ శ్రీనివాస రామానుజదాసు గారి ప్రవచనం, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ. భక్త సమారాధన.

19-8-25 మంగళ. - ఉ.6 గం.లకు శ్రీరాధాకృష్ణుల సహస్రనామార్చన. ఏకాహం సంకీర్తన ప్రారంభం. ఉ.10 గం.లకు శ్రీ శ్రీనివాస రామానుజ దాసు గారి ప్రవచనం, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ. భక్త సమారాధన.

20-8-25 బుధ - ఉ.6 గం.లకు శ్రీరాధాకృష్ణుల సహస్ర నామార్చన, దీక్షావిరమణ, ఏకాహం హారతి.

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును**

**జులై 2025**

6 ఆది: తొలి ఏకాదశి - శ్రీ సద్గురు పాదపూజ.

10 గురు: ఆషాఢ పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ.

20 ఆది: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ.

**ఆగస్ట్ 2025**

8 శని : శ్రావణ పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ.

16 శని : శ్రీ కృష్ణాష్టమి - శ్రీ సద్గురు పాదపూజ.

18 సోమ: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ.

27 బుధ: వినాయకచవితి - శ్రీ సద్గురు పాదపూజ.

(గత సంచిక తరువాయి) **శ్రీ గురుగీతా** -కీ.శే డా॥వి.వి. ప్రసాదరావు

## అథ ప్రథమోధ్యాయః

**గురుబుద్ధ్యా ఽ ఽ త్మనో నాన్యత్ సత్యం, సత్యం వరాననే**

**తల్లా భార్థం ప్రయత్నస్తు కర్తవ్యశ్చ మనీషిభిః** 25

<u>**పదవిభాగము**</u> :-

**గురుబుధ్యా-ఆత్మనః-న-అన్యత్-సత్యం-సత్యం-వరాననే-**

**తల్లాభార్థం-ప్రయత్నః-తు-కర్తవ్యః-మనీషిభిః.**

<u>**టీక**</u> :- వరాననే=శ్రేష్ఠ వక్త్రముగల ఓ పార్వతీ! ఆత్మనః=ఆత్మకన్న; అన్యత్=వేరైన; లేక మరొక; సత్యం=సత్యము; న=లేదు(అనునది); గురుబుధ్యా=గురుదేవునిచేత సుశిక్షితమైన బుద్ధిచేత మాత్రమే (తెలియ వీలగు) సత్యం=సత్యము; మనీషిభిఃచ= బుద్ధిమంతులైన మనుషులకు, తల్లాభార్థం=ఆ ఆత్మజ్ఞాన ప్రాప్తియను లాభముకొరకు; ప్రయత్నః=ప్రయత్నము; కర్తవ్యః=చేయదగినది.

<u>**వ్యాఖ్య**</u> :- పై శ్లోకములలో గురుతత్త్వం తెలియని శాస్త్రాదిక జ్ఞానం, నిష్ప్రయోజనమని చెప్పబడినది. సంస్కృతంలో 'ఆనన' శబ్దం నోరు అనే అర్థంలో తరచూ వాడబడుతూ ఉంటుంది. నోరు ఉన్నందుకు ప్రయోజనం చక్కని వివేకం గల్గించే ప్రశ్నలను అడిగి గురుదేవుడి నుంచి సమాధానాన్ని పొందటమే. పార్వతీ దేవి ప్రశ్నతో ఆనందభరిత స్వాంతుడైన పరమశివుడు ఆమెకు తన ఆనందాన్ని "వరాననే" అనే సంబోధనతో తెలియజేస్తున్నాడు. "దుర్లభం త్రిషులోకేషు..... వరాననే" అనే ఇరువది ఒకటవ శ్లోకంలో కూడ అమ్మవారిని పరమేశ్వరుడు "వరాననే" అని సంబోధించటం గమనించ దగినది.

"ఓ వరాననా!" ఆత్మకన్న (గురుదేవునికన్న) వేరొక సత్యములేదు" అను సత్యము ఆ గురుదేవునిచే సుశిక్షితమైన బుద్ధికి మాత్రమే అవగతమౌతుంది. అందుచేత మనీషులు (బుద్ధిమంతులు) అయిన వారు ఆ ఆత్మ (గురు)జ్ఞాన ప్రాప్తికై ప్రయత్నించటమే కర్తవ్యము" అని సచ్ఛిష్యునకు దిశానిర్దేశం చేస్తున్నాడు

పరమేశ్వరుడు. ఈశ్వరుడు, జగత్తు, జీవుడు అనేవి సృష్టిలో మూడు ప్రధాన తత్త్వాలు, అవ్యక్తమైనవాడు యీశ్వరుడు. వ్యక్తమైనది జగత్తు. వ్యక్తా వ్యక్తమైనది జీవుడు. జీవుడికి తాను శరీరం కానని, కేవలం చైతన్యముననీ తెలిసుకోవటమే కర్తవ్యం. జడమైన శరీరంలో చైతన్యమాత్రుడైన తాను ఎలా భాసిస్తున్నాడు? ఈ గడ్డు ప్రశ్నకు సమాధానం తెలుసుకోవటానికే గురు శుశ్రూష కావాలి. గురు శరీరం కూడ తన శరీరం లాంటిదే గనుక, గురువు కూడ తనలాటి సామాన్య మానవుడని భావించాడా, మానవుడై భ్రాంతి చెందుతాడు. గురువును శరీరమాత్రుడిగా కాక, పరమాత్ముడిగా తెలుసుకుంటాడా మనీషియై కృతార్థుడౌతాడు. అందువల్లనే గురు(ఆత్మ) తత్త్వ జ్ఞానం కోసం ప్రయత్నించటమే మనీషుల కర్తవ్యం అని సాధకులకు దిశానిర్దేశం చేస్తున్నాడు కృపాళువైన పరమేశ్వరుడు.

**గూఢావిద్యా జగన్మాయా దేహ శ్చాఽ జ్ఞాన సంభవః**
**విజ్ఞానం యత్ప్రసాదేన గురు శబ్దేన కథ్యతే.** 26

<u>**పదవిభాగము**</u> :-

**గూఢ-అవిద్యా-జగత్-మాయా-దేహః-చ-అజ్ఞాన-సంభవః-**
**విజ్ఞానం-యత్-ప్రసాదేన-గురు శబ్దేన- కథ్యతే.**

<u>**టీక**</u> :- గూఢ=గూఢ మైన, తెలిసికొనుటకు వీలుగాని రహస్యమైన; అవిద్యా=బ్రహ్మాసత్యమని గుర్తించలేని తెలియనితనము; జగత్=జన్మించుట గతించుట స్వభావముగా గల్గిన ప్రపంచము; మాయా=ఏది లేదో అది వున్నట్లు కన్పించు లక్షణము; దేహః=శరీరము; అనునవి; అజ్ఞాన సంభవః= అజ్ఞాన (జీవబ్రహ్మైక్య జ్ఞానము లేమిని అజ్ఞానమంటారు)ము వలన పుట్టినవి (వానిని గూర్చిన) విజ్ఞానము విశదమైన లేక విస్పష్టమైన జ్ఞానము; యత్=ఎవరి; ప్రసాదేనః=దయవలన కలుగుతుందో(సఃవారు); గురుశబ్దేన=గురువు అను పేరుతో; కథ్యతేః=పిలువబడతారు.

<u>**వ్యాఖ్య**</u> :- "అవిద్య, జగత్తు, మాయ, దేహము, అజ్ఞానము" అను పదములు చాలా నిగూఢమైనవి, వాటిని అర్థం చేసుకోవటం కూడ కష్టం.

'అనాత్మయైన శరీరములను ఆత్మయనుట- "**అహం**"- అనుటయే అవిద్య' అని వివేక చూడామణి వివరిస్తుంది. "**యామా, సామాయా, యా న విద్యతే సా అవిద్యా**" (ఏదిలేనిదో అదిమాయ, ఏది తెలియబడదో అది అవిద్య) అని వాసుదేవ మననము, "విద్య కానిది అవిద్య"- ముఖ్యంగా బ్రహ్మ జ్ఞానం లేదా ఆత్మ జ్ఞానం లేకపోవటం అని వేదాంత పరిభాషా వివరణము. "**అనిత్యా, శుచి, దుఃఖాత్మనాసు నిత్య, శుచి, సుఖాత్మ ఖ్యాతి రవిద్యా**" అని పాతంజల యోగసూత్రములు. ఈ వివరణల వైవిధ్యాన్ని బట్టి ఈ శబ్దాలు గూఢమైనవి, గ్రహించటానికి క్లిష్టమైనవనీ తెలుస్తున్నది.

అయితే గురుగీత యీ విషయంలో చాలా స్పష్టమైన వివరణ యిస్తున్నది. అవిద్య-జగత్ -మాయ-అజ్ఞానము, దేహము ఇవన్నీ లేక పోయినా ఉన్నట్లు భాసించేవి. ఉన్నది బ్రహ్మమొక్కటే అనే సత్యం ముందే తెలియజేయబడినది. కనుక లేని (అనగా ఊరికే తోచే-పారమార్థిక సత్యముకాని) జగత్తూ, దేహమూ,అవిద్యా, మాయా, అజ్ఞానముల వలన ఉన్నట్లుగా తోచేవే. అయితే యీ అనిత్యత్వాన్ని ఎవరి అనుగ్రహం వల్ల తెలుసుకుని గుర్తించగలుగుతామో, ఆ మహాత్ముణ్ణి "గురువు" అనే శబ్దంతో వ్యవహరిస్తామని 'గురు' శబ్దానికి ఒక చక్కని నిర్వచనాన్ని ప్రసాదిస్తున్నది యీ శ్లోకం.

అజ్ఞానాన్ని కారణ శరీరం అంటారు. "**కారణం చా జ్ఞాన సంజ్ఞో అనృత దుఃఖాత్మకా అమీ, తేభ్యో విలక్షణస్త్వాత్మా సత్య జ్ఞానాది లక్షణః**" అంటుంది వాసుదేవమననం. జీవాత్మ ప్రాప్తించటానికి కారణం అజ్ఞానం గనుక, అజ్ఞానాన్ని కారణ శరీరంగా శాస్త్రాలు గుర్తించాయి. ఈ అజ్ఞానం వల్ల అవివేకం, అవివేకం వల్ల అభిమానం, అభిమానం వల్ల రాగ ద్వేషాలు, రాగ ద్వేషాల వల్ల తదనుగుణమైన కర్మలూ, కర్మల వల్ల దేహమూ-ఇది జీవావతరణకు తోచే అవరోహణక్రమం.

- సశేషం

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## అప్పన వారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

(ముంజవరపుకొట్టు - మహాశివరాత్రి)

మహాత్ములతో పరిచయ భాగ్యం ఎన్నో జన్మల సుకృత ఫలంగా లభించేది. అచంచల విశ్వాసంతోను, సంశయానికి తావునివ్వని నిశ్చయ బుద్ధితోను ఆ పరిచయమును పరిపూర్ణ శరణాగతిగా మలచుకొని, జీవితాంతము నిలుపుకో గలిగిన వారు ధన్యులు. కాని కొందరు మానవులు మహాత్ములకు ఎంతో సన్నిహితంగా వచ్చి కూడా దూరమైపోతారు. మళ్ళీ అటువంటి మహదవకాశం ఎన్ని జన్మలకు లభిస్తుందో చెప్పలేము. ఎవరైనా భక్తులు అతి స్వల్ప కాలంలో అత్యంత అంతరంగ భక్తులై మసలు కుంటున్నపుడు, వారెంతో అదృష్టవంతులని మనం భావిస్తాము. శ్రీ బాబుతో ఆ మాటే అన్నపుడు వారు "నిజమే. వారి అదృష్టం గొప్పదే. కాని దానిని అంత్యకాలం వరకు నిలబెట్టుకోగలిగిన వాడే ధన్యుడు" అనే వారు.



శ్రీ బాబుతో తొలిపరిచయ భాగ్యాన్ని పొందిన గ్రామాలలో ముంజవరపుకొట్టు ఒకటి. ఆ గ్రామమంతా అప్పన వారి కుటుంబాలతో నిండి ఉండేది. శ్రీ బాబును ప్రప్రథమంగా ఉప్పాడ గ్రామంలో తమ యింటిలో నిలుపుకొని, సేవించుకోగల అరుదైన భాగ్యాన్ని పొందిన దంగేటి సత్యవతమ్మగారు అప్పన వారి ఆడబడుచు కావటం వలననే , పట్టుదలగా శ్రీ బాబును ముంజవరపుకొట్టు తీసుకొని వచ్చారు.

అప్పటికింకా శ్రీ బాబు బాల్యంలోనే (ప్రజల దృష్టిలో) ఉన్నారు. అప్పన రామారావుగారు, సుబ్బారావుగారు, పుల్లంరాజుగారు, రాజేశ్వరరావు గారు మొదలైన వారందరితో శ్రీ బాబు చాలా స్వతంత్రంగాను, చనువుగాను ఉండేవారు. అప్పట్లో శ్రీ బాబు చాప మీద బొంతగాని, పరుపుగాని, వేసుకొని పడుకునే వారు. వాళ్ళందరు కలిసి శ్రీ బాబుతో బాటు పడుకోవటం, నిద్రలో ఒకళ్ళపై ఒకళ్ళు కాళ్ళు

చేతులు వేసుకొని నిద్రపోవటం కూడా జరిగేది. అంత స్వతంత్రంగా మెలిగినా, వాళ్ళందరికి శ్రీ బాబు యెడల భయ భక్తులుండేవి. మహాత్ములని తెలుసు. అయినా గోపగోపీ జనంతో శ్రీకృష్ణస్వామి ఎలా సన్నిహితులై చెలికానివలె సంచరించారో, అలాగే శ్రీ బాబుతో బాల్యంలో కలిసి మెలిసి ఆడుకుంటూ, పాడుకుంటూ సంచరించే అరుదైన భాగ్యాన్ని పొందిన అదృష్టవంతులలో అప్పన వారొకరు.

అప్పన సుబ్బారావుగారు చక్కగా పాటలు, పద్యాలు పాడేవారు. శ్రీ బాబు మామిడి తోటలలో కూర్చుని, వారితో పాడిస్తూ తాము కూడ పాడుతూ తాటి ముంజెలు, తేగలు, చెరుకు ముక్కలు, తాటి రొట్టె, కొబ్బరి రొట్టె, కొబ్బరి నీళ్ళు - ఒకటేమిటి? **రసోవై స:** అన్నట్లు బ్రహ్మానంద రసస్వరూపులైన శ్రీ బాబు ప్రతిదీ తాము రుచి మాత్రం చూసి అందరికి అందిస్తూ, ఆనంద రసంలో ముంచి తేల్చేవారు. అలా చేస్తూనే , దానితో తత్త్వసారాన్ని మేళవించి అందించేవారు.

ముంజెకాయలు కొట్టి ముంజెలు తీసి యిస్తే తినటం శ్రీ బాబుకు నచ్చదు. కాయను ముచ్చిక వైపున, మూడు ముంజెలూ తలలు కనబడేటట్లు చెక్కి శ్రీ బాబు చేతికిస్తే, వారు వీణ తీగను మీటినంత సునాయాసంగా ఒక్కొక్క ముంజెను బొటన వ్రేలితో పైకి లాగి నోట్లోకి పడేటట్లు ఎగుర వేసుకుని తినేవారు. అలవాటు లేనివాడు కష్టపడి ఒక కాయలోని మూడు ముంజెలూ పెకలించి తినగలిగే లోపల, శ్రీ బాబు పది కాయలు ఖాళీ చేసేవారు. అదొక ఒడుపు; అందరికీ రాదు.

“చూశారా! ఈ ముంజెలు తాటికాయలో బాగా పాతుకొని పోయి ఉన్నాయి. ముంజెకాయలతో బాగా అనుభవం ఉన్నవాడు, యిప్పుడు నేను ఒక్క బొటన వ్రేలితో ముంజెలను అలవోకగా పెకిలించినట్లుగా, ముంజెలను లాగివేయగలడు. ముంజెలు తీసేస్తే, తాటిబుర్ర ఖాళీ అయిపోతుంది. అలాగే మానవుని బుర్రలో త్రిగుణాలూ (సత్త్వ, రజో, తమో గుణాలు) బాగా పాతుకొని పోయి ఉంటాయి. అనుభవజ్ఞులు, త్రిగుణాతీతులు అయిన సద్గురుదేవులను ఆశ్రయిస్తే, వారు మన బుర్రలో పాతుకుని పోయిన త్రిగుణాలను గోటితో మీటినట్లు అంత ఒడుపుగాను తీసివేయగలరు. అప్పుడు ఖాళీగా మిగిలిన బుర్ర భగవానునికి నివాస యోగ్యమౌతుంది.

- సశేషం

(గత సంచిక తరువాయి) విష్ణు  కథలు -రమణ ప్రసాద్

# భక్త రామదాసు

సీతారామస్వామీ! నే చేసిన నేరంబేమి? – అని వాపోయాడు.

“ఇన్ని రోజులుగా బందిఖానాలో కష్టాలు పడుతూ నిన్ను వేడుతుంటే, “నా గతి ఇటులాయె గదా!” అని, “నీ దాసుడగు నన్ను చూసి ఆదరించవైతివి.” ఇకనైనా ప్రత్యక్షమై నన్ను రక్షించ రాదా?” అని రాముణ్ణి ఇలా అడుగుతున్నాడు రామ దాసు.



**ఇక్ష్వాకుకుల తిలక ఇకనైనా పలుకవె రామచంద్రా**
**నను రక్షింపకున్నను రక్షకులెవరింక శ్రీరామచంద్రా**
**సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకము రామచంద్రా**
**ఆ పతకమునకు పట్టె పదివేల వరహాలు రామచంద్రా**
**కలికి తురాయి నీకు బొలుపుగ చేయిస్తి రామచంద్రా**
**నీవు కులుకుచు తిరిగెదవు ఎవడబ్బ సొమ్మని రామచంద్రా**

**మీ తండ్రి దశరథ మహరాజు పెట్టెనా రామచంద్రా**
**లేక మీ మామ జనక మహరాజు పంపెనా రామచంద్రా**
**అబ్బ తిట్టితినని ఆయాస పడవద్దు రామచంద్రా**
**ఈ దెబ్బలకోర్వక అబ్బా తిట్టితినయ్య రామచంద్రా!**

అని దీనంగా వేడుకొన్నాడు. డబ్బు చెల్లించలేక నానా బాధలు అనుభవిస్తూ పన్నేండేళ్ళు చెరసాలలో ఉన్నాడు. ఈ దీనాలాపనలు చెరసాల దాటి, భద్రగిరి ఆలయ ప్రాకారాలు దాటి, గర్భగుడిలోకి ప్రవేశించి అక్కడ ఖంగున ప్రతిధ్వనించింది. సీతమ్మ తల్లి ఉలిక్కిపడి మెడలో ఉన్న చింతాకు పతకాన్ని తడిమి చూసుకుంది. ప్రక్కకు తిరిగి పతిదేవుని శిరస్సున అల్లన కదిలే కలికి

తురాయి వైపు ఓరగా చూసింది. "కథ బాగానే నడిపిస్తున్నారు. ఇదేనా మీకు సేవలు చేసిన పరమ భక్తునికి ఫలితం" అని గట్టిగా నిలదీసి అడిగింది రామయ్యను. రామయ్య నవ్వి ఊరుకున్నాడు.

గోపన్న తన దీర్ఘకాల శిక్షకు ఆరాటపడుతూ "రామచంద్రుని నమ్మి నవ్వుల పాలయ్యాను. భూమిజ పాద పద్మాలకు మొక్కి తన పాట్లు తెలిపితే నన్ను ప్రేమతో కాపాడుతుందాతల్లి" అనుకొని

"నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లి నను బ్రోవమని చెప్పవే"

అని వేడుకున్నాడు.

సీతమ్మ గోపన్న ఆర్తనాదానికి కరిగిపోయి "ఈ వేళ అతనిని మీరు రక్షించాలి" అని వేడుకుంది. రాములవారు లక్ష్మణునివైపు చూశారు. ఇద్దరూ సేవక వేషాలు ధరించారు. అన్నదమ్ములిద్దరూ ఆ రాత్రి వేళ తానీషా అంతఃపురం చేరుకునే వేళకు చెరసాలలో రామదాసు "రాముని దయలేని జీవితం ఎందుకు" అనుకుంటూ విషం తీసుకుని ప్రాణాలు వదలాలనే నిశ్చయానికి వచ్చాడు.

తానీషా గాఢ నిద్రలో ఉన్నాడు. గోపన్న చెల్లించవలసిన పైకాన్ని శ్రీ రామచంద్రుడే వచ్చి చెల్లించినట్లు చక్కని కలగన్నాడు. తన కల గురించి భార్యకు చెపుతుండగా తలుపు ఎవరో తట్టారు. తలుపు తెరచి చూస్తే తేజోవంతులైన ఇద్దరు సేవకులు కనిపించారు.

"ఎవరు మీరు?" అని ప్రశ్నించాడు తానీషా.

"మాది భద్రాద్రిపురం. అనిశం రామదాసుని ఆజ్ఞ ప్రకారం నడుచుకుంటాం. ఆయనను ఖైదు చేసిన వార్త విని పైకం చెల్లించి అతని ఆపదను బాపి తీసుకుపోయే పనిమీద వచ్చాము" అన్నారు వారు.

"ఇదిగోనండి పైకము. దివిటీ వేయించండి, తివాసులు పరిపించండి! రవాణ ధనములు కన్నుల చూసి మాకు రసీదు ఇవ్వండి."

తానీషా వారిని ఈ విధంగా అడుగుతున్నాడు :

తానీషా – ఏ దేశమునుండు వారు? మీరు ఎందుండి ఇటు వచ్చినారు?

రాముడు – తొలుత గోదావరి వారము. మాస్థలము భద్రాచలమందు.

తానీషా – ఎవరి జవానులు మీరు? మిమ్మెవరు పంపగ వచ్చినారు?
రాముడు – దాస జవానులు మేము. రామదాసు పంపగ వచ్చినాము.
తానీషా – ఏమేమి నామము గలవారు? మీరేమి నీమము గలవారు?
రాముడు – రామోజీ, లక్ష్మోజీ నామం, రామానుజ మతము వారం.
తానీషా – అర్ధమంతయు తెచ్చినారా? లేక వ్యర్ధముగా వచ్చినారా?
రాముడు – వ్యర్ధులము కాము మేము. మీ అర్ధమంతయూ తెచ్చినాము.
తానీషా – లక్షలారునూ తెచ్చినారా? ఇంక శిక్షలో నుండమన్నారా?

వారు చెల్లించిన ధనాన్ని చూసి తబ్బిబ్బులయ్యాడు తానీషా. ఈ విధముగా శ్రీరాముడు పైకం చెల్లించి రసీదు రామదాసునకు ఇవ్వటానికి తానీషా రూపం ధరించి వచ్చే సమయానికి విషం తీసుకుని జీవము విడవడానికి దృఢ నిశ్చయుడైనాడు రామదాసు. మానసంగా రాముని ధ్యానిస్తున్నాడు.

"రామ రామ శ్రీరామా రామా రామా యనరాదా మనసా
కామిత ఫలదుడగు శ్రీ సీతా కాంతుని గనరాదా మనసా" అని.

రామలక్ష్మణులు ఆ విష పాత్రను నేలపై త్రోసి తానీషా రూపంలో రసీదు చేత పట్టుకొని ప్రేమగా, "రామదాసా! నీ బాకీ పైకము రద్దయింది" అని రసీదు అందించి అంతర్ధానమయ్యారు.

- సశేషం

Printed, and Published by Paluri Siva Rama Kaliprasad, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

మే 7 నుండి 11 వరకు బెంగళూరు శ్రీ కాళీవనాశ్రమ శాఖ వారు
నిర్వహించిన వార్షిక సత్సంగ కార్యక్రమ దృశ్యములు.










REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on Fifth and Sixth of every month

RNI No. 37804/81
POSTAL REGD. No. : GTR/27/2024-26

మే 22 న బళ్ళారి శ్రీ అవధూత బాలాంజనేయ స్వామి మఠంవారు
నిర్వహించిన 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణలో పాల్గొన్న శ్రీ మాతాజీ







If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.